
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 10 అక్టోబరు 2025



బావ అండతో చెలరేగిన బావమరిది..

- అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ
- సీజ్ చేసి విచారణ చేపట్టిన గనులశాఖ అధికారులు
- 5 ఎకరాలకు దరఖాస్తు.. 10 ఎకరాలకుపైగా ఆక్రమణ
- మంత్రి గిరిధర్‌రెడ్డి దందా



6

హత్య కేసులో ఏడేళ్ల జైలుశిక్ష



పోలీసుల అదుపులో ముద్దాయి రౌతు బాబు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో రౌతు బాబు అనే నిందితుడికి గురువారం కడప అదనపు ఏడవ న్యాయమూర్తి రమేశ్ కుమార్ ఏడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.1.70 లక్షల జరిమానా విధించినట్లు లక్కిరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దిన్నెపాడు వడ్డెపల్లెకు చెందిన రౌతు బాబు సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లెకు చెందిన సావిత్రి (21)ను 2021లో వివాహం చేసుకున్నాడు. పెళ్లయినప్పటి నుంచి ఆమెను వేధింపులకు గురిచేసేవాడు. ఈ నేపథ్యంలో 9-10-2021న భార్యను హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో గురువారం జడ్జి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలు సంతృప్తి పొందేలా సేవలందించాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమీక్ష సమావేశానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల సేవలు, రీసర్వే, తదితర సేవలపై సమీక్షిస్తూ ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో పెండింగ్ పనులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో మందుల కొరత ఉండరాదని, ఈ-ఔషధీ మందుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ-పంట వివరాలు నమోదు చేసి పౌరసరఫరాల శాఖ ద్వారా బియ్యం సేకరణ జరగాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల పింఛన్లకు సంబంధించి అప్పీళ్లపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులకు ఆయా శాఖల అంశాలకు సంబంధించి తగు సూచనలు జారీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు.

నకిలీ మద్యం తయారీకి బెంగళూరు నుంచి ముడి సరుకు

- కేసులో 23కు చేరిన నిందితులు
- జయచంద్రారెడ్డి వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా
- కస్టడీకి కోరే జాబితాలో రాజు, శ్రీనివాసరావు?



పట్టుబడ్డ నకిలీ మద్యం బాటిళ్లు (ఫైల్)



దాసరిపల్లి జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి



జయచంద్రారెడ్డి డ్రైవర్ అష్రఫ్

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో ఏ2 కట్టా రాజు విచారణాధికారులకు ఇచ్చిన వాంగ్మూలం కేసును కీలక మలుపు తిప్పింది. నకిలీ మద్యం తయారు చేయాలనే ఆలోచన ఎవరిది? ఎవరెవరు ఇందులో ఉన్నారు? ఇది తయారు చేయడానికి అవసరమైన ముడి సరుకులు ఎక్కడి నుంచి ఎవరు తెచ్చారు? ఈ మద్యాన్ని ఎవరు? ఎలా విక్రయించారు? వచ్చిన డబ్బును ఎవరికి ఎంత? ఎలా పంచారు వంటి వివరాలను రిమాండ్ రిపోర్టులో పూసగుచ్చినట్లు వివరించారు. అయితే కేసులో ఇంకా అరెస్టు కాకుండా తప్పించుకున్న కీలక వ్యక్తులు అరెస్టు అయితే ఈ నకిలీ మద్యం తయారీ కేంద్రం వెనుక అండగా ఉన్న పెద్ద మనుషులు ఎవరు? వాళ్లకు ఎంత ముట్టింది? అనే విషయాలు వెలుగులోకి వస్తాయి. దీంతో ఇప్పుడు ఈ కేసుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జూన్ నుంచి నకిలీ మద్యం తయారీ

కట్టా రాజు వాంగ్మూలం ప్రకారం ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రానికి బెంగళూరు, హైదరాబాదు నుంచి పెద్ద స్థాయిలో స్పిరిట్, ముడి సరుకులు రవాణా అయ్యాయి. బెంగళూరుకు చెందిన బాలాజీ అక్కడి నుంచి స్పిరిట్ క్యాన్లు, వాటర్ ప్లాంట్, ఎస్ఎస్ ట్యాంకు, ఎలక్ట్రిక్ మోటార్‌లు కొనుగోలు చేసి పంపాడు. అలాగే హైదరాబాదుకు చెందిన నకిరికంటి రవి నకిలీ లేబుల్స్, పెట్ బాటిళ్లు, క్యాప్‌లు, హీల్స్‌ను ఇక్కడికి పంపాడు. పెట్ బాటిళ్లను గన్నవరంలో కొనుగోలు చేశారు. అలాగే ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు మూడు సీలింగ్ మిషన్లను తన వాహనంలోనే మదనపల్లెకు తీసుకొచ్చాడు. ముడి సరుకులు, స్పిరిట్, సామాగ్రి మొత్తం ములకలచెరువుకు తరలించి జూన్ నెల నుంచి నకిలీ మద్యంను తయారు చేసి బెల్ట్‌షాపులు, మద్యం దుకాణాలకు సరఫరా చేశారు.

జనార్దన్‌రావు లొంగిపోతాడా?

కేసులో ప్రధాన నిందితుడు ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈయన తంబళ్లపల్లె కోర్టులో లొంగిపోతాడనే ప్రచారం ఉండడంతో బెంగళూరు ఎయిర్‌పోర్టుకు ఎక్సైజ్ అధికారులలో కూడిన రెండు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. అయితే మూడు రోజులుగా ఆయన అదిగో లొంగిపోతాడు.. ఇదిగో లొంగిపోతాడు అని పుకార్లు జోరుగా ఉన్నాయి. అలాగే కేసులో నిందితుడిగా చేర్చిన జయచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు బెంగళూరులోని ఆయన ఇంటి వద్ద ఎక్సైజ్ అధికారులు మకాం వేశారు. జయచంద్రారెడ్డితో పాటు ఆయన పీఏ రాజేశ్‌లు విదేశాలకు పారిపోకుండా ఉన్నతాధికారులు లుకౌట్ నోటీసులు పంపినట్లు విశ్వసనీయ సమాచారం.

23కు చేరిన నిందితులు

ఈ కేసులో ఇప్పటికి మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చారు. నకిలీ మద్యం తయారీ కేంద్రంపై అధికారులు దాడులు చేసిన రోజు 14 మందిని నిందితులుగా పేర్కొన్నారు. తర్వాత విచారణలో జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసే అంబురుసు అలియాస్ బాబు, నకిలీ మద్యం బెల్ట్‌షాపులకు సరఫరా చేసిన జయచంద్రారెడ్డి కారు డ్రైవర్ అష్రఫ్, బెంగళూరుకు చెందిన బాలాజీ, ఆయన అనుచరుడు సుదర్శన్, హైదరాబాదుకు చెందిన నకిరికంటి రవిలను నిందితులుగా చేర్చారు. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావుతో పాటు ఈ కేసులో తొమ్మిది మంది అరెస్టు కావాల్సి ఉంది. వారి వాంగ్మూలం ఆధారంగా కేసులో మరికొందరు నిందితులుగా చేరనున్నారు.

జయచంద్రారెడ్డి వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా

కట్టా రాజు వాంగ్మూలం ప్రకారం జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహనం ద్వారా కూడా నకిలీ మద్యం సరఫరా జరిగింది. జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహనమైన బ్లాక్ స్కార్పియోలో ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాలకు నకిలీ మద్యం సరఫరా చేశారు. నకిలీ మద్యం సరఫరా సమయంలో వాహన నెంబరు ప్లేటును మార్చి నకిలీది తగిలించినట్లు సమాచారం. సాధారణంగా జయచంద్రారెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గంలో పర్యటించప్పుడల్లా బ్లాక్ స్కార్పియో వాహనం ఆయన వాహనం ముందు వెళ్లేది.

డైరీలో ఉన్న నగదు వివరాలు ఇవే

కట్టా రాజు రిమాండ్ రిపోర్టు ప్రకారం నకిలీ మద్యం అమ్మకాల్లో వచ్చిన నగదును నిందితులు పంచుకున్నారు. నగదు తీసుకున్న వారు డైరీలో సంతకాలు కూడా చేశారు. నకిలీ మద్యం అమ్మకాల్లో వచ్చిన లాభంలో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావుకు రూ.7,81,760, బెంగళూరుకు చెందిన స్పిరిట్, ముడి సరుకులు పంపిన బాలాజీకి రూ.1,77,50,00, జయచంద్రారెడ్డిఇంట్లో పనిచేసే అన్బురాసు అలియాస్ బాబుకు రూ.8 లక్షలు, కట్టా రాజుకు (తాను తీసుకున్న నగదు) రూ.12,26,000, సింహాచలంకు (నకిలీ మద్యం తయారీ కేంద్రంలో ఏప్రిల్ నుంచి మే వరకు పనిచేసి వెళ్లిపోయాడు) రూ.2,57,500కు చెల్లించారు. బెంగళూరుకు చెందిన బాలాజీ కుమారుడు సుదర్శన్ కూడా వచ్చి రూ.6 లక్షలు తీసుకుని డైరీలో సంతకం చేసి తీసుకెళ్లాడు. ప్రధాన నిందితుడు ఇక్కడ పనిచేసే తమిళనాడు, ఒరిస్సాకు చెందిన కూలీలకు నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించేవాడు. ఈ వివరాలన్నీ కట్టా రాజు వద్ద దొరికిన డైరీ, ల్యాప్‌లాప్‌లో పొందుపరిచారు.

అంతరాయం లేని విద్యుత్‌ను అందించడమే ధ్యేయం

- విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సురేందర్‌నాయుడు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సురేందర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ధ్యేయమని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సురేందర్ నాయుడు తెలిపారు. గురువారం రాయచోటి పట్టణంలోని విద్యుత్ సర్కిల్ ఆఫీస్‌లో గల ఎస్ఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్రనాయుడు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ ఉప కేంద్రాల్లో విద్యుత్ లైన్లలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ముందుగానే అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధిక లోడు ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్స్ బిగించి లోవోల్టేజీ సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులందరికీ పీఎం సూర్య ఘర్ సోలార్ రూఫ్‌టాప్ బిగించుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు అందరూ సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు వ్యతిరేకిస్తే కఠిన చర్యలు

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

రాజంపేట టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడైనా అద్దె బస్సు ఆపరేటర్లు వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు హెచ్చరించారు. గురువారం రాజంపేట ఆర్టీసీ డిపోను సందర్శించి ఇక్కడి సమస్యలపై ఆరా తీసి ఉత్తమ ఉద్యోగుల అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వూరు వద్ద అద్దె బస్సు సిబ్బందిపై కొందరు ప్రయాణికులు దాడి చేశారని, ఈ విషయమై వెంటనే స్పందించి ఎస్పీతో మాట్లాడి దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయించామని తెలిపారు. ఎవరైనా డ్రైవర్లు, కండక్టర్లపై దాడులు చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు అద్దె బస్సుల ఆపరేటర్లు బస్సులు నిలిపివేయడం, ఆందోళనలు నిర్వహించడం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. స్త్రీ శక్తి పథకం వల్ల బస్సుల్లో రద్దీ పెరిగి కొంత ఇబ్బంది ఉందని, త్వరలో వెయ్యికి పైబడి కొత్త ఆర్టీసీ బస్సులు వస్తున్నాయని, కొత్త బస్సులు వస్తే సమస్య ఉండదన్నారు. రాజంపేట డిపోలో ఉన్న సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరిస్తామన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు, పోలీసులు ద్వారకా తిరుమలరావుకు సాదరంగా స్వాగతం పలికారు.

జీఎస్టీ సంస్కరణలతో ఎన్నో ప్రయోజనాలు

- డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఆరోగ్యశాఖలో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య తెలిపారు. గురువారం సంబేపల్లె, దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ఆరోగ్య బీమాపై జీఎస్టీ ఎత్తివేసినట్లు తెలిపారు. ల్యాబ్ పరికరాలపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినట్లు తెలియజేశారు. కంటి పరీక్షలు, వివిధ పరీక్షలపై కూడా జీఎస్టీ తగ్గించారని, దీంతో రోగులకు ఆర్థిక భారం తగ్గిందన్నారు. రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, ఎంపీడీవో రామచంద్ర, సంబేపల్లె ప్రాథమిక వైద్యాధికారి మధుసూదన్‌రెడ్డి పలు అంశాలపై తెలియజేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సహదేవరెడ్డి, దేవపట్ల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సంబేపల్లె హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా



కోళ్లబైలు-2 సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్థులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు కాలనిలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. గురువారం కోళ్లబైలు-2 సచివాలయం వద్దకు వచ్చిన గ్రామస్థులు మాట్లాడుతూ కోళ్లబైలు కాలనీ శివాలయం వీధిలో సీసీ రోడ్లు లేక ఎగుడుదిగుడు మట్టిరోడ్డులో వృద్ధులు, చిన్నారులు నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ మురుగునీటి కాలువలు లేక మురుగునీరంతా వీధుల్లో ప్రవహిస్తోందని, ఈ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోందన్నారు. రాత్రిళ్లు వీధిదీపాలు లేకపోవడంతో ప్రజలు ఇళ్లలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందన్నారు. విషపురుగులు, పాముల బెడద ఎక్కువైందన్నారు. ఈ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, అందుకే ధర్నా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు చంద్రశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు

కేవీ పల్లెలో దారుణం



- చెల్లెలిపై అన్న అఘాయిత్యం
- మగబిడ్డకు జన్మనిచ్చిన బాలిక

పీలేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నానాటికీ అంతరించిపోతున్న నైతిక విలువలకు అద్దం పట్టే సంఘటన గురువారం పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలంలో వెలుగు చూసింది. సోదరి బాగోగులు చూసుకోవాల్సిన సోదరుడు కామంతో కళ్లు మూసుకుపోయి ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చడమే కాకుండా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందన్న భయంతో పుట్టిన బిడ్డను వదిలించుకోవాలని బంధువులు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టి ఈ విషయం బయటకు పొక్కింది. కేవీ పల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) తండ్రికి పక్షవాతం సోకి కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణార్థం బాలిక తల్లి గల్ఫ్ దేశాలకు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న ఆ బాలికపై ఆమె పెద్దనాన్న కుమారుడు కన్నేశాడు. కొంతకాలంగా ఆమెను లొంగదీసుకుని ఆమెపై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చింది. ఆమె శరీరంలో జరిగిన మార్పులను గమనించిన ఇరుగు పొరుగు, సమీప బంధువులు ఆమెను మూడు రోజుల క్రితం పీలేరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యురాలి వద్దకు తీసుకెళ్లడంతో బాలిక గర్భంతో ఉన్న విషయం తెలిసింది. బాలికను గట్టిగా అడగడంతో తనపై జరిగిన అఘాయిత్యాన్ని వారికి వివరించింది. ఇక చేసేది లేక వారు ఆ విషయాన్ని గ్రామంలోని పెద్ద మనుషులకు తెలియజేశారు. అదే సమయంలో బాలికకు కాన్పు చేయాలని వైద్యురాలిని అభ్యర్థించడంతో ఆమె ఆ బాలికను తన ఆసుపత్రిలో జాయిన్ చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆ బాలిక సోదరుడు గ్రామం నుంచి ఉడాయించాడు. అతని తరపు వారు ఆసుపత్రికి చేరుకుని బాలిక వద్ద ఉన్న వారితో మంతనాలు ప్రారంభించారు. పుట్టిన బిడ్డను పీలేరులోనే వదిలించుకోవాలని, బాలిక ఆలనా పాలనా తాము చూసుకుంటామని నమ్మబలికారు. అందరూ సమ్మతించి ప్రసవం అయిన తరువాత గ్రామంలోని కుల పెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకోవచ్చునని తీర్మానించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ బాలిక బుధవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ ప్రసవం కావడం, పీలేరులో ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో బిడ్డతో పాటు బాలికను గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసుకుని వెళ్లిపోయారు. వెళ్లిపోయే సమయంలో పుట్టిన బిడ్డను ఎవరికైనా ఇచ్చేయాలని కొంతమందితో సంప్రదింపులు చేస్తుండడంతో ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో వారు అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లిపోయారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. అటు పోలీసులకు, ఇటు ఐసీడీఎస్ అధికారులకు సైతం సమాచారం లేకపోవడం కొసమెరుపు. ఇటువంటి సంఘటనల్లో కాసింత ముందుగా స్పందించాల్సిన ఐసీడీఎస్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోవడం విశేషం. తీరా గురువారం సాయంత్రం స్పందించిన ఐసీడీఎస్ అధికారులు బసన్నగారిపల్లెలోని బాలిక స్వగృహం, పీలేరులోని ప్రైవేటు ఆసుపత్రిలో విచారణ చేపట్టి కాన్పు జరిగిన విషయం నిజమేనని నిర్ధారించారు. బాలికకు కాన్పు చేసిన ప్రైవేటు ఆసుపత్రిపై పీలేరులోని పలు ప్రజాసంఘాలు మండిపడ్డాయి. మైనర్ బాలిక కాన్పు కోసం వచ్చినప్పుడు పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టడం, కాన్పు అయిన తరువాత కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడంపై వారు ధ్వజమెత్తారు. అంతేకాకుండా బిడ్డను ఇతరులకు అప్పగించేలా ఆసుపత్రి నిర్వాహకులు మంతనాలు సాగించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ, డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాశ్ ఆరోపించారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజంపేటలో రప్పా..రప్పా...

- వివాదాస్పద ఆకేపాటి ఎస్టేట్‌లో వైసీపీ సమావేశం
- రప్పా.. రప్పా.. ఫ్లెక్సీలు చేతబట్టి హిజ్రాల డ్యాన్స్



రప్పా..రప్పా ఫ్లెక్సీలతో హిజ్రాల డ్యాన్స్

రాజంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం ఆకేపాడు పరిధిలో అందునా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డికి సంబంధించి వివాదాస్పద ఆకేపాటి ఎస్టేట్ ప్రాంగణంలో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం సమీపంలో హిజ్రాలతో కలిసి రప్పా.. రప్పా..2.0 అని రాసిన ఫ్లెక్సీలు చేతబట్టి చిందులేస్తూ కేరింతలు కొడుతూ చేసిన హంగామా వివాదాస్పదంగా మారింది.

విస్తృత స్థాయి వైసీపీ సమావేశ స్థలం రాష్ట్రస్థాయిలో వివాదాస్పదంగా ఉంది. ఇది పక్కాగా ప్రభుత్వ భూమి అని, ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమర్‌నాథరెడ్డి ఎస్టేట్‌ను కట్టించుకున్నారని ఇటీవల జిల్లా అధికారులు పట్టాలను రద్దు చేసి ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారు. దీనిపై అమర్‌నాథరెడ్డి కోర్టును ఆశ్రయించి స్టే పొందారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టు పరిధిలో ఉంది. అటువంటి వివాదాస్పద స్థలంలో ఉన్న ఎస్టేట్‌లో వైసీపీ నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మేడా రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, కడప మాజీ జడ్పీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, కడప మాజీ మేయర్ సురేష్‌బాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వజ్రం భాస్కర్‌రెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, తదితర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికార తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేస్తూ వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తుతూ జగన్ నామస్మరణ చేశారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నిమ్మనపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికను మాయమాటలతో బలాత్కారం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఎస్‌ఐ మాట్లాడుతూ ఓ గ్రామానికి చెందిన బాలిక (17) మదనపల్లిలోని ఓ కళాశాలలో చదువుతోంది. రోజు బస్సులో మదనపల్లికి వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొరివి శంకర కుమారుడు కళ్యాణ్ ఆ యువతిని ప్రేమ పేరుతో ఆమె వెంట తిరుగతూ వేధించేవాడని తెలిపారు. పది రోజుల కిందట బలవంతంగా ద్విచక్రవాహనంపై తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపార న్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆ యువతిని గట్టిగా ప్రశ్నించగా తనను కళ్యాణ్ బెదిరించి నెల రోజుల కిందట బోయకొండ అటవీ ప్రాతంలోకి తీసుకెళ్లి బలవంతం చేశాడని తెలిపింది. దీంతో స్థానిక పోలీసులకు బాధిత తండ్రి ఫిర్యాదు చేయడంతో కళ్యాణ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ


గల్లా నాగరత్నమ్మ

గుర్రంకొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని తాగడానికి మంచి నీళ్లు అడిగి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లిన సంఘటన బుధవారం సాయంత్రం నడిమి ఖండ్రిగలో చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. మండలం లోని నడిమిఖండ్రిగ వాసి గల్లా నాగరత్నమ్మ అదే గ్రామంలో ఉన్న కుమార్తె వద్ద ఉంటూ జీవిస్తోంది. గ్రామంలోని శ్రీనివాస్ డాబా పక్క నున్న మామిడి తోటలోని ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని యువకులు వచ్చి తాగడానికి మంచి నీళ్లు అడిగారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలు ఇంట్లోకి నీళ్లకోసం వెళుతుండగా వెనుక నుంచి మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసును లాకెళ్లాడు. ఈ క్రమంలో వృద్ధురాలు కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు వృద్ధురాలికి సపర్యలు చేయడంతో తేరుకుంది. దీంతో జరిగిన విష యాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులకు చెప్పడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు.

దేవుని మాన్యాలకు రక్షణ కల్పిస్తాం

● జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్


ప్రహరీగోడను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఏసీ విశ్వనాథ్

సుండుపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుని మాన్యాలకు రక్షణ కల్పిస్తామని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సుండుపల్లెమ్మ మాన్యాన్ని ఆయన పరిశీలించారు. 2127 సర్వే నెంబర్‌లో 4.40 ఎకరాల భూమి ఉందని, ఇది సుండుపల్లెమ్మ మాన్యంగా రికార్డుల్లో ఉందన్నారు. అయితే కొంతమంది ఎన్‌వోసీ కోసం వినతిపత్రం అందించారని, కానీ ఎన్‌వోసీ ఇవ్వలేదన్నారు. ఈ స్థలం 9 మంది ఆధీనంలో ఉందని తెలిసిందన్నారు. సుండుపల్లెమ్మ దేవస్థానం దేవదాయశాఖలో పబ్లికేషన్ కాలేదని, 2127 సర్వే నెంబర్‌లో కొంతమంది రిజిస్ట్రేషన్, ఇంకొందరికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయని, వీరికి నోటీసులు జారీ చేస్తామన్నారు. పై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే శివాలయాన్ని సందర్శించినప్పుడు ఆలయం ప్రహరీగోడ వర్షాలకు పడిపోయిందని, పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని, అలాగే రెండు ధ్వజస్తంభాలు తుప్పు పట్టాయని, నూతనంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని గ్రామస్థులు కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో మలేరియా నివారణపై పోస్టల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాపునీరు నిలబడే చోట లార్వా చేసుకొని దోమలు ఎక్కువై మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామాల్లో పోస్టర్లు వేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పల్లెలోనూ ఆరోగ్య కార్యకర్త లార్వా సర్వే నిర్వహించి కొబ్బరి చిప్పల్లో, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతిరోజు గ్రామలను సందర్శించి జ్వరాలు వచ్చిన వారికి చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బెల్ట్‌షాపులపై కొనసాగుతున్న దాడులు

● నిందితుడు అరెస్టు ● 51 మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగుతున్నాయి. ములకలచెరువు కేంద్రంగా జరుగుతున్న నకిలీ మద్యం గుట్టురట్టు కావడంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగిస్తున్నారు. తాజాగా గురువారం స్థానిక పోలీసులు మండలంలోని కాలువపల్లె పంచాయతీ బుద్దలవారి పల్లెలో దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేశారు. అతని నుంచి 51 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సీఎంతో ముక్కా

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కోడూరు-వెంకటగిరి, సోమశిల బ్యాక్‌వాటర్, నియోజకవర్గంలో చేయాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లతో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రైల్వేకోడూరు ప్రచారంలో కోడూరు-వెంకటగిరి రోడ్డు, పెనగలూరు వద్ద సోలశిల బ్యాక్‌వాటర్ ఎత్తిపోతల పథకంపై ప్రజలకు హామీ ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయాలని కోరామన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి రావాల్సిన అభివృద్ధి కార్యక్రమాల నివేదికను అందించామన్నారు. అలాగే కోడూరు ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు డయాలసిస్ కోసం రోగులు వెళుతున్నారని, రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించామని తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారని ముక్కా తెలిపారు.


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చిస్తున్న ముక్కా

బావ అండతో.. చెలరేగిన బావమరిది..

● అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ
● సీజ్ చేసి విచారణ చేపట్టిన గనులశాఖ అధికారులు
● 5 ఎకరాలకు దరఖాస్తు.. 10 ఎకరాలకు పైగా ఆక్రమణ
● మంత్రి గిరిధర్‌రెడ్డి దందా


క్వారీలో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం కేసులో పాత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బావ, బావమరుదులు చేసిన నిర్వాకం మరొకటి బయటపడింది. టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఇన్నాళ్లు ఉన్న జయచంద్రారెడ్డి అధికారం అండతో ఆయన బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డి వివిధ శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండానే దర్జాగా క్వారీ మొదలు పెట్టేసి రూ.లక్షల విలువ చేసే కంకరను అమ్ముకున్నారు. ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం కేసులో జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి కార్యకలాపాలపై ప్రభుత్వం తీవ్ర స్థాయిలో దృష్టి సారించింది. ఈ క్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇన్ని రోజులు జరిగిన అనేక అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట పంచాయతీ పరిధిలో వీళ్లు నిర్వహిస్తున్న క్రషర్‌ను గురువారం గనుల శాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించి సీజ్ చేశారు.


తవ్వకాలపై సర్వే చేస్తున్న మైన్స్ సర్వేయర్లు

అనుమతులు లేకుండానే..

సాధారణంగా క్వారీ ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, గనుల శాఖల అనుమతులు కావాలి. అదో పెద్ద తతంగం. అయితే గిరిధర్‌రెడ్డి నడుపుతున్న తుమ్మనంగుట్ట క్వారీ విషయంలో ఇవేవి పూర్తి స్థాయిలో జరగనట్లు మైన్స్ అధికారులు గుర్తించారు. గిరిధర్‌రెడ్డి తుమ్మనంగుట్ట శివారులో సర్వే నెంబరు-111లో ఉన్న 82 ఎకరాలపైకి ఐదు ఎకరాలు లీజుకు ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. దీనికి పూర్తి స్థాయిలో వివిధ శాఖల నుంచి అనుమతులు రాకుండానే మరో ఐదు ఎకరాలు పెంచాలంటూ అధికారులను కోరితే అందుకు అధికారులు సమ్మతించలేదు. దీనిపై జయచంద్రారెడ్డి గనులశాఖా మంత్రి టి.జి భరత్‌కు లెటర్ రాసి అలినేషన్ కింద భూమి కేటాయించాలని కోరారు. ఆ పని ఏదో చేసి పెట్టాలని టీజీ భరత్ ఏపీఐఐసీకి లెటర్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఏపీఐఐసీ నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు, అక్కడి నుంచి బి.కొత్తకోట తహసీల్దార్‌కు రిట్కో కంపెనీ దరఖాస్తు పరిశీలించాలని ఆదేశాలు అందాయి. దీనిపై ఆగమేఘాల మీద అనుకూలంగా నివేదిక ఇవ్వాలని అప్పటి వీఆర్‌వోపై ఒత్తిడి తెచ్చారు. ఆయన అందుకు అంగీకరించకపోవడంతో ఆయనను కలెక్టర్‌కు సరెండర్ చేశారు. అంతా తమ చేతిలో ఉందిలే ఎవరు వస్తారు.? ఏమవుతుంది..అన్న ధీమానో ఏమో అనుమతులు రాకుండానే మిషనరీ తెచ్చేసి క్రషింగ్ మొదలు పెట్టేశారు. అనుమతుల విషయం పట్టించుకోకుండా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. అయితే పరిస్థితి ఒకసారిగా తారుమారు కావడంతో గురువారం మైన్స్ ఏడీ రంగకుమార్, తహసీల్దార్ బావాజాన్‌లు తమ సిబ్బంది, పోలీసుల సాయంతో తుమ్మనంగుట్ట వద్దకు వెళ్లి క్వారీని సీజ్ చేశారు. మైన్స్ ఆర్‌ఐ విజయకుమారి, సర్వేయర్ మాధవీలత, ములకలచెరువు రఫీ, ముబారక్ తదితరులు క్వారీలో కొలతలు వేసి విచారణ చేపట్టారు. క్వారీలో ఎన్ని క్యూబిక్ మీటర్లు తవ్వారు? ఎన్ని వేల యూనిట్ల కంకర తీసి ఉంటారు? ప్రస్తుతం ఉన్న స్టాకు ఎంత? అనే వివరాలను నమోదు చేశారు. ఇది ముమ్మాటికీ అక్రమ క్వారీయేనని తేల్చారు. మైన్స్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పర్యావరణ శాఖ అనుమతులు లేకుండానే విద్యుత్ శాఖాధికారులు ఎలా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారో అర్థం కావడం లేదని పరిశీలనకు వెళ్లిన అధికారులు విస్తుపోయారు. ప్రస్తుతం ఈ క్వారీలో 6415 క్యూబిక్ మీటర్ల కంకర నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీనిలో డస్ట్ నుంచి 20 ఎంఎం వరకు వివిధ రకాలుగా ఉన్న సరుకును సీజ్ చేశారు. రాష్ట్ర గనుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకే ఈ దాడులు జరిగినట్లు సమాచారం.

ఇద్దరు పీఆర్ డీఈఈలకు ఇంక్రిమెంట్ల కోత

● ఒక ఏఈఈకి విముక్తి

కలికిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దముడియం మండలం సుద్దపల్లె ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సమగ్ర అభివృద్ధి పథకాల అమల్లో తీవ్రమైన అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లకు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2017లో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల్లో జరిగిన అక్రమాలతో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లినట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఇద్దరు డీఈఈలు, ఒక ఏఈఈపై అభియోగాలు నమోదు చేసి 2017 జూలై 25న ప్రభుత్వానికి తదుపరి చర్యల కోసం నివేదించారు. దీని పైన పలు దఫాలు జరిగిన విచారణలు, సంజాయిషీల అనంతరం ఎనిమిదేళ్ల తరువాత తుది చర్యల ఉత్తర్వులు జారీ అయ్యాయి. అప్పట్లో జమ్మలమడుగు డీఈఈగా పనిచేసి ప్రస్తుతం కడప సబ్ డివిజన్ కమలాపురం క్వాలి టీ కంట్రోల్ డీఈఈగా పనిచేస్తున్న పి.వెంకట్రావు, ప్రస్తుతం ప్రొద్దుటూరు పీఆర్‌ఐ డీఈఈగా పనిచేస్తూ అప్పట్లో జమ్మలమడుగు క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈగా వున్న టి.గోపాల్ దాస్‌పై ఆరోపణలు రుజవు కావడంతో ఇద్దరికి ఒక వార్షిక ఇంక్రిమెంట్ (క్యుములేటివ్ ప్రభావంతో) వంతున కోత విధించారు. ఇందులో వీరితో పాటు ఆరోపణలు ఎదుర్కొన్న అప్పటి జమ్మలమడుగు క్వాలిటీ కంట్రోల్ విభాగం ఏఈ ఎం.డి.సుబ్బారెడ్డి (ప్రస్తుతం రిటైర్డు)పై మాత్రం తదుపరి చర్యలను ఉపసంహరించారు. ఇద్దరు డీఈఈలు తీవ్రమైన అక్రమాలకు పాల్పడి పనుల్లో నాణ్యత లేకుండా, కొలతల్లో భారీ తేడాలతో అన్ని సాంకేతిక నియమాలను విస్మరించి న కారణంగా అప్పట్లోనే ప్రభుత్వ ఖజానాకు రూ.11,40,983లు నష్టం వాటిల్లినట్లు విచారణలో రుజువైంది. దీంతో చివరగా ఇద్దరు డీఈఈలకు ఒక్కో వార్షిక ఇంక్రిమెంటు వంతున కోత విధిస్తూ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ


పుల్లంపేట ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మెమోరాండంతో ఉపాధ్యాయులు

పుల్లంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ప్యాప్టో నాయకులు సీవీ రమణమూర్తి, సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మార్సీలో మెమోరాండం సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులతో ఎటువంటి బోధనేతర పనులు చేయించమని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యాశక్తి, జీఎస్టీ 2.0, గూగుల్ సీట్లు నింపడం తదితర పనులు చెప్పడం తగదన్నారు. బోధనేతర పనుల వల్ల విద్యార్థులకు బోధన ఆటంకం కలగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్యాప్టో నాయకులు సిద్దయ్య, ఎస్వీ రమణ, శివరాంప్రసాద్, మునగపాటి శ్రీను, మాదవమూర్తి, ఎస్ఎండీ గౌస్, నాగభూషణం, పెంచలయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుతో ఎస్పీ భేటీ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావును గురువారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కలిశారు. మదనపల్లెలోని వెన్నెల గార్డెన్‌లో ప్రజారవాణా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై వారు చర్చించారు. జిల్లాలో బస్సుల ప్రయాణీకుల భద్రతను మరింత పెంచాలని, బస్సు స్టేషన్లలో భద్రత చర్యలు పటిష్టం చేయాలని చర్చించుకున్నారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు నిరంతరం సురక్షితమైన, నమ్మకమైన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడంలో ఎస్పీ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళా ప్రయాణికుల రక్షణకు పోలీస్‌శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని అందిస్తామన్నారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను గురువారం ఎస్పీ ధీరజ్ తనిఖీ చేశారు. ఎస్పీగా నియమితులైన మొదటసారి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు విచ్చేసి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, తాలుకా సీఐ మహమ్మద్ రఫీ, ఎస్సీలు అన్సర్‌బాషా, శివకుమార్, పోలీసులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఎండీతో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్

కోర్టు కేసులోని ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు


తాళాలు పగులగొడుతున్న దృశ్యం

మదనపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్బారెడ్డి లేఅవుట్‌లో ఓ ఇంటి విషయమై ఇరువర్గాల మధ్య 2011 నుంచి కోర్టులో కేసు నడుస్తోంది. ఇదే ఇంటిని స్వాధీన పరచాలంటూ 2024లో పట్టణానికి చెందిన జరీన్, చలపతి, దేవప్రకాష్, రవి కుమార్, గంగరాజుపై మరో కేసు వేశారు. 17ఏళ్లుగా దేవప్రకాష్, రవి కుమార్ స్వాధీనంలో ఇల్లు ఉంది. ఇంట్లో ఎనిదేళ్లగా అద్దెకు ఉంటున్న గంగరాజు ఈనెల 2న ఇల్లు ఖాళీ చేసి తాళాలు యజమాని దేవప్రకాష్‌కు అప్పగించాడు. ఇల్లు ఖాళీ అయిన విషయం తెలుసుకు న్న ఓ వర్గం తన అనుచరులతో వెళ్లి ఇంటిని తమకు అప్పగించాలని, లేకుంటే కూల్చేస్తామని దేవప్రకాష్‌ను బెదిరించాడు. బుధవారం రాత్రి మరోసారి వివాదాస్పద ఇంటికెళ్లి దౌర్జన్యంగా ఇంటికి వేసిన తాళం పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడు. బాధితుడు దేవప్రకాష్ పోలీసులను ఆశ్రయిస్తే ఇరువర్గాలను గురువారం స్టేషన్‌కు పిలిపించి రికార్డులు, కోర్టు పత్రాలను పరిశీలించి బాధితుడిని ఇంట్లోకి వెళ్లవద్దంటూ పోలీసులు ఆదేశించారు. ఇంటిని సంబంధం లేని వ్యక్తులు కబ్జాకు ప్రయత్నించారని పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోగా, తమ అనుభవంలోని ఇంట్లోకి తమను ప్రవేశించవద్దని సూచించడం ఏంటని బాధితులు వాపోయారు.

వైసీపీ కుట్రలతో రాష్ట్రంలో అలజడులు

● టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న నరసింహప్రసాద్

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ కుట్రలతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులోని ఆయన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ పెద్దల నుంచి వచ్చిన డైరెక్షన్‌తోనే చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవళంపల్లె వద్ద అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నేతలు నిప్పు పెట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలో వైసీపీ సర్పంచ్ గోవిందయ్యతో పాటు పలువురు పాల్గొన్న విషయం సాక్ష్యాధారాలతో సహా బట్టబయలైందన్నారు. దళిత సంఘాలు, ప్రజా సంఘాలు వైసీపీ చేస్తున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంబేడ్కర్ భావజాలం భావితరాలకు మార్గనిర్దేశంగా చేయాలన్న ఉద్దేశంతో ఆయన విగ్రహాలను ఊరూరా నెలకొల్పుతున్నారని, అటువంటి మహనీయుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి రాజకీయ లబ్ధి పొందాలని అనుకోవడం దళితులను అవమానపరచడమేనన్నారు. సీసీ కెమెరాలు, ఫోన్ లోకేషన్, కాల్ లిస్టుల ఆధారంగా స్పష్టంగా వైసీపీ నేతల బాగోతం బట్టబయలైందన్నారు. కూరత్వమే తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లె ప్యాలెస్‌లో ఉన్నారని విమర్శించారు. రాజ్యాంగమన్నా, ప్రజాస్వామ్యమన్నా లెక్కచేయని క్రూర స్వభావి జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఉండటానికి అర్హుడు కాదన్నారు. జగన్ ఇంకెంత కాలం దళితుల పేరు చెప్పి కుట్ర రాజకీయాలు చేస్తావని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని విధ్వంసాలు చేయాలని ప్రయత్నించినా తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. వైసీపీ హయాంలో 56వేల మంది దళితులపై దాడులు, 192 మందిని హత్య చేశారని స్వయంగా రాజ్యసభలో కేంద్రం వెల్లడించిందని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

విద్యార్థుల గైర్హాజరును నమోదు చేయాలి

● స్కూల్ కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరును రిజిస్టర్‌లో నమోదు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఆల్టర్నేట్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఉవల వెంకట్రామయ్య తెలిపారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని, పాఠశాలల్లో దీర్ఘ గైర్హాజరు విద్యార్థుల పునఃప్రవేశం, డ్రాపౌట్ విద్యార్థులు లేకుండా చూడడం ప్రధానోపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. ఒక విద్యార్థి మూడు రోజుల పాటు వరుసగా గైర్హాజరైతే వెంటనే తల్లిదండ్రులతో సంప్రదించాలని సూచించారు. విద్యార్థి తిరిగి పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి, సీఆర్పీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అనంతరాజుపేట హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకట్రామయ్య

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి

రాయచోటిటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజాన్ని నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని జాతీయ పొగాకు నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి కోరారు. గురువారం పట్టణంలోని డైట్ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు మనిషి ఆయుష్షు క్షీణిస్తోందన్నారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు శివభాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు బీఎస్ పద్మావతి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

చిన్నమండెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ క్లాప్ మిత్రలకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. గురువారం మండల కేంద్రంలోని దేవపట్ల రోడ్డులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద క్లాప్ మిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 680 ప్రకారం కనీసం రూ.10 వేల వేతనం చెల్లించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు చెల్లించాలని, రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డెయ్య, నరసింహులు, రెడ్డెప్ప, వెంకటరమణ, నరసింహ, శాంతికుమారి, అంజనమ్మ, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల ఎంపిక బాధ్యత వీవోలదే

● ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి



యానిమేటర్ల అసోసియేషన్ ప్రతినిధులకు ఉత్తర్వులు అందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు, సెర్ప్‌కు వారధిగా విధులు నిర్వహిస్తున్న గ్రామ సమాఖ్య సహాయకుల ఎంపిక బాధ్యత గ్రామ సమాఖ్యలదే. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి గురువారం ఒక మెమో విడుదల చేశారు. గ్రామ సమాఖ్య సహాయకుల పదవీ కాలాన్ని మూడేళ్ల పాటు ఉండేలా గత ప్రభుత్వం హయాం (2019 డిసెంబరు 1) నుంచి అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన తరువాత గ్రామ సమాఖ్య సహాయకుల మూడు సంవత్సరాల పదవీకాలం నిబంధనలను నిలుపుదల చేస్తూ చర్యలు తీసుకున్నారు. అదే విధంగా గ్రామ సమాఖ్య సహాయకులను ఎంపిక చేయడం, తొలగించడం గ్రామ సమాఖ్యల బాధ్యతలను ఆమె మెమోలో పేర్కొన్నారు. గ్రామ సమాఖ్య తీర్మానాన్ని సంబంధిత ఏపీయం డీఆర్‌డీఏ పీడీకి తెలియపరచాల్సి ఉంటుంది. ఏదైనా ఆర్థిక నేరాలకు పాల్పడితే అలాంటి వీఏవోలపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకునే అర్హత డీఆర్‌డీఏ పీడీకి ఉంటుందని వివరించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆమె తెలిపారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



దౌలతాపురంలో భూముల రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్న రీసర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా సర్వే శాఖ అసిస్టెంటు డైరెక్టరు మురళీక్రిష్ణ అన్నారు. మండలంలోని దౌలతాపురం రెవెన్యూ గ్రామంలో చేపట్టనున్న రీసర్వేను ఏడీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి రైతులతో మాట్లాడారు. సర్వే నెంబర్లు 44, 45, 46లలో సర్వే ఎలా జరుగుతోందని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూముల మధ్య రాబోవు కాలంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్త కుండా ఉండేందుకే రీసర్వే చేపడుతోందన్నారు. బ్రిటీష కాలంలో చేపట్టిన సర్వే తప్ప రాష్ట్రస్థాయిలో ఇంత వరకు భూసర్వే ఇంత వరకు జరగలేదన్నారు. సర్వే అధికారులకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించి తమ భూము లకు సంబంధించి కొలతలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, మండల సర్వేయరు ఖాజాహుసేన్, సర్వే డీటీ అర్చన, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలుపాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
మార్పునకు స్థల పరిశీలన



వేంపల్లెలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి బస్టాండ్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికార బృందం

వేంపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప బైపాస్‌రోడ్డులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేసేందుకు అధికారుల కమిటీ పరిశీలన జరిపింది. గండి రోడ్డులో ఉన్న ప్రైవేటు భవనాలను, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కమిటీ ప్రతినిధులు పరిశీలించారు. వేంపల్లెలో ఉన్న కార్యాలయాన్ని మార్చాలని స్థానిక టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌ను కోరారు. వారి అభ్యర్థన మేరకు గండిరోడ్డులో ఉన్న భవనాలను జిల్లా రిజిస్ట్రార్ వీవీఎన్ బాబు, ఫైర్ ఆఫీసర్ శివరామిరెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ నాగేంద్ర, ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్ తదితర అధికారుల బృందం పరిశీలించారు. గండిరోడ్డులో ఉన్న ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. అలాగే బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి ద్వారా కలెక్టర్‌ను కోరారు. బస్టాండ్ సమీపంలో ఉన్న స్థలంలో కార్యాలయాన్ని ఉచితంగా నిర్మించి ఇస్తామని బీజేపీ నాయకులు గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి మేరకు బస్టాండ్ వద్దనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ వివరాల నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

13 నుంచి క్రీడా టాలెంట్ హంట్

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈ నెల 13 నుంచి 16 వరకు అండర్ 12, 14, 16, 19 పురుష క్రీడాకారులకు టాలెంట్‌హంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ సభ్యుడు కె.రవి శంకర్ ఎంపికలకు హాజరై క్రీడాకారుల నైపుణ్యాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి తదుపరి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆ మేరకు ఈనెల 13న అండర్ 12, 14న అండర్ 14, 15న అండర్ 16, 16న అండర్ 19 క్రీడాకారులు తప్పక హాజరుకావాలన్నారు. క్రీడాకారులు తమ కిట్ బ్యాగులతో పాటు ఆధార్, బర్త్ సర్టిఫికెట్, ప్రెజంట్ స్టడీ సర్టిఫికెట్‌తో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరు కావాలన్నారు.

'వైద్య విద్య ప్రైవేట్‌పరం ఎన్టీఆర్ ఆశయాలకు విరుద్ధం'

వేంపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయడం స్వర్గీయ ఎన్టీరామారావు ఆశయాలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందులలో మెడికల్ కళాశాలకు రూ.400 కోట్లు ఖర్చు చేశారన్నారు. మరో వంద కోట్లు ఖర్చు చేసి ఉంటే నిర్మాణాలు పూర్తయ్యేవన్నారు. అయితే నర్సింగ్ కళాశాల భవనాలలో వైద్య విద్యార్థులకు తరగతులు నిర్వహించవచ్చు, ఆసుపత్రికి సంబంధించి వందశాతం పూర్తయిందన్న ఉద్దేశ్యంతో ఎన్ఎమ్‌సీ పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం ద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు.

15లోగా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

● విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్స్‌ను పరిష్కరించకపోతే అక్టోబరు 15వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళతామని స్ట్రగుల్‌కమిటీ ప్రధాన కార్యదర్శి వి.సుబ్బి రెడ్డి విద్యుత్ యాజమాన్యాలను హెచ్చరించారు. విద్యుత్ కార్యాలయాలు జనరేటింగ్ స్టేషన్లలో అక్టోబరు 14న వర్క్‌టు రూల్ పాటిస్తామన్నారు. ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో గురువారం కార్మికుల, ఉద్యోగులతో ఉద్యమ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ సంస్థల్లో సుమారు 27వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నా రన్నారు. దశాబ్దాలుగా చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. తెలంగాణలో 16వేల మంది విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేశారన్నారు. అయితే ఏపీలో పర్మనెంట్ పక్కనబెడితే జీతాలు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్నట్లుగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు పీఆర్సీ బకాయిలు నేటికి చెల్లించడం లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 4డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యుత్ రంగంలోని కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందని, అవి పరిష్కారం కావాలంటే ఉద్యమాలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు వి.గంగయ్య, డి.పుల్లారెడ్డి, రాజు, శివప్రసాద్, వెంకటరమణ తదితరులు ప్రసంగించారు.

ఆర్టీపీపీ యాష్ సమస్యను పరిష్కరిస్తాం...సీఈ



ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు

ఎర్రగుంట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ సమస్యకు పరిష్కారం చూపుతామని చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్లాంట్‌లో యాష్‌ను నియంత్రించే ఈఎస్‌పీ తదితర యాంత్రాల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా దుమ్మురాకుండా చేస్తామన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో వస్తున్న యాష్ కాలుష్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడుగ్గా రోడ్లపైన, ఎక్కడపడితే అక్కడ ఫ్లైయాష్ డంప్ చేయకుండా చర్యలు చేపడతామన్నారు. వాటిపై ప్రత్యేక చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆర్టీపీపీ 600, ట్యాంకర్ల గేటు వద్ద రోడ్లపై ఆపుతున్న వాహనాలను ఆపకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 210 మెగావాట్ల సామర్థ్యంగల 5వ యూనిట్ 5వ తేదీ ఓవరాలింగ్ నిమిత్తం ఆపినట్లు తెలిపారు. 20రోజుల్లో పూర్తి చేసి మరో రెండు యూనిట్లను కూడా ఓవరాలింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్‌కు డిమాండ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా అందుకు తగ్గట్టుగా ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. గురువారం వెయ్యి మెగావాట్లకు పైబడి ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ప్లాంటుల్లో సుమారు 2లక్షలకుపైబడి బొగ్గు నిల్వలున్నట్లు తెలిపారు. బొగ్గు సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నాం

● ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్ బాష



డీఈఓ కార్యాలయం ఏడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ విద్యారంగంలో అవలంభిస్తున్న ప్రయోగాత్మక విధానాలు, తిరోగమన చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఇలియాస్ బాష, సెక్రటరీ జనరల్ రాళ్లపల్లె అబ్దుల్లా తెలిపారు. గురువారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు కడప జిల్లా పరిపాలన అధికారి విజయ్ కుమార్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణలను ఫ్యాప్టో నేతలు కలిసి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాటట్లాడుతూ జూన్ నుంచి యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్, జీఎస్టీ 2.0 పేరుతో మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయడం, విద్యాకానుకల పంపిణీ, రోజువారి నివేదికలను ఎంఈఓ కార్యాలయానికి పంపడం వంటి కార్యక్రమాలు ఉపాధ్యాయులపై భారీ భారం మోపుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అసెస్‌మెంట్ పుస్తకాలు, టీచర్ హ్యాండ్‌బుక్ వంటి పనులతో బోధనకు ఆటంకం కలుగుతోందని, ఉపాధ్యాయులను తరగతి బోధన నుంచి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, పాఠ్యాంశాల బోధన తప్ప ఇతర బోధనేతర కార్యక్రమాలను పూర్తిగా బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రీణ్ కిరణ్, జిల్లా నాయకులు మాదన విజయ్ కుమార్, ఖాదర్‌బాష, శ్యామలాదేవి, సుబ్బారెడ్డి, జ్యోతి, రామచంద్రబాబు, జుబేర్ అహ్మద్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ... వృద్ధురాలికి గాయాలు

సీకేదిన్నె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులివెందుల రోడ్డులో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వెంగమాంబ అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. వేంపల్లె నుంచి కడపకు వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు పులివెందుల రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గురువారం మలుపు తీసుకుంటుండగా వెంగమాంబ అనే మహిళ వెనుకభాగంలో తగిలి కిందపడిపోవడంతో గాయాల య్యాయి. వృద్ధురాలిని బస్సు డ్రైవర్ హుటాహుటిన ఆటోలో ఎక్కించుకుని చికిత్స అందించేందుకు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు?

లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో దొంగతనం చేసి పారిపోయిన మాబాష, హసీనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకెళితే .... జనవరిలో అనంతపురం నుంచి వచ్చామని పార్నపల్లె గ్రామానికి చెందిన రాధ మహిళ ఇంట్లోకి అద్దెకు దిగారు. కొన్ని నెలలు ఆమెతో మంచిగా ఉంటూ నమ్మించారు. ఆగస్టు నెలలో రాధ తోట వద్దకు వెళ్లిన తర్వాత ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి రూ.1.10లక్షల నగదు, 9గ్రాముల బంగారం, వెండి పట్టీలు దొంగలించి పారిపోయారు. ఎట్టకేలకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.


జీఎస్టీ రేట్ల తగ్గింపుపై అవగాహన

కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప ఐఎంఏ కార్యాలయంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టాల్‌ను ఏర్పాటు చేసి జీఎస్టీ రేట్ల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్నూల్ డ్రగ్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగ కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రవిబాబు స్టాల్‌ను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత నెల 22వ తేదీ నుంచి వినియోగదారునికి మేలు జరిగేలా జీఎస్టీలో భారీ మార్పులు చేసిందన్నారు. అందులో భాగంగా 12శాతం నుంచి 5శాతానికి తగ్గించిందన్నారు. అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

అరటి తోటను పరిశీలించిన జర్మన్ శాస్త్రవేత్తలు

లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కులగారిపల్లెలో గురువారం జర్మనీ శాస్త్రవేత్తలు షర్వినాబుష్, జెరాల్డ్ రెహ్మాన్‌లు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న అరటితోటను పరిశీలించారు. గ్రామానికి చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా అరటి పంటను పండిస్తున్నారు. శాస్త్రవేత్తలు అరటి తోటను పరిశీలించి సాగులో యాజమాన్య పద్ధతులను, పంట దిగుబడిపై రైతును అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పార్నపల్లె విద్యార్థులు





లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండలంలోని పార్నపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ అండర్-19 విభాగంలో 10వ తరగతి చదువుతున్న నాగచైతన్య సాఫ్ట్‌బాల్ పోటీలకు, అండర్-17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న ప్రేమ్, హరి హరణ్ బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కృషిచేసిన పీడీ విక్టర్‌ను, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రతి ఖాతాదారునికి నాణ్యమైన సేవలు



మాట్లాడుతున్న ఏజీఎం రవికుమార్


కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ఖాతాదారునికి నాణ్యమైనసేవలు అందించాలని భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గెల్లా రవికుమార్ అన్నారు. గురువారం కడప సెవెన్‌రోడ్స్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారునికి అవసరమైన సేవలను అందించడం, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సరైన సమయంలో సేవలను అందిస్తున్న ఏకైక బ్యాంకు భారతీయ స్టేట్ బ్యాంక్ అని అన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు తెలియని నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తే ఓటీపీలను చెప్పకూడదని ఖాతాదారులకు సూచించారు. అంతేకాకుండా సైబర్ నేరాలపై ఏమైన అనుమానాలు ఉంటే 1930కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. నకిలీ కాల్స్‌పట్ల పూర్తి అప్రమత్తతో ఉండాలన్నారు. ఏమైన ఖాతాలపై అనుమానాలు ఉంటే నేరుగా బ్యాంకు సిబ్బంది వద్దకు వచ్చి వారి నివృత్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. బ్యాంకు మేనేజర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ మోసపూరిత కాల్స్‌పై స్పందించరాదని తెలిపారు. లింకులపై ఎలాంటి క్లిక్కులు చేయకుండా జాగ్రత్త ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి, డిప్యూటీ మేనేజర్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో
26.3 టీఎంసీల నీటిమట్టం



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో గురువారం 26.376 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వా యిర్ నుంచి వరదకాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట నుంచి సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.



స్మార్ట్ రేషన్‌కార్డు ప్రతి ఇంటికి అందించండి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించిన స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రతి ఇంటికి అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్‌కార్డు అందించాలన్నారు. అలాగే సమస్యలు ఉంటే మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, దానికి పరిష్కారంగా కొత్త బోర్లు వేయిస్తామని, నీరు పడనిచోట ట్యాంకర్లతో సరఫరా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో దళిత వేదిక ఉపాధ్యక్షుడు ఓబులేసు, కావలి ఆంజనేయులు, యోగాంజనేయులు, వెంకటకృష్ణయ్య, కొలిమి పక్కీరయ్య, వెంకట్రమణ, రిజ్వాన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి మరిన్ని అవార్డులు పొందాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ పీకాక్ అవార్డును సాధించిన నారా భువనేశ్వరి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా గురువారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆపన్నులను, అన్నార్తులను ఆదరించడమే కాకుండా మారుమూల ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం కల్పిస్తూ, ఎన్టీఆర్ హెల్త్ క్లీనిక్‌ల ద్వారా పేదలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్న నారా భువనేశ్వరికి ఈ అవార్డు రావడం హర్షణీయమన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ లక్కిరెడ్డిపల్లె మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా చరణ్, కార్యదర్శిగా గణేశ్, ఉపాధ్యక్షులుగా రెడ్డిప్రకాశ్, తేజ, మణికంఠ, సహాయ కార్యదర్శులుగా వేలు గంగాధర, తరుణ్, కోశాధికారిగా లవకుమార్‌లను ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

వీరబల్లి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్ద దళితవాడలో గురువారం ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా జూనియర్ కళాశాల విద్యార్థులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను, కంపచెట్లను తొలగించారు. అదేవిధంగా గ్రామంలో చెత్తాచెదారం లేకుండా శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో భాస్కర్, రఘురామయ్య పాల్గొన్నారు.



పనులు కేటాయించలేదని రగడ

● సమావేశం మధ్యలో లేచి వెళ్లిన ఎంపీటీసీలు ● పనులు చెస్తేనే బిల్లులు : ఎంపీడీవో

● రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

సుండుపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం అర్థాంతరంగా ఆగిపోయింది. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవన్‌లో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. పంచాయతీరాజ్ ఏఈ, వ్యవసాయశాఖ ఏవో, ఉద్యాన శాఖ అధికారి ప్రసంగించిన అనంతరం వైస్‌ఎంపీపీ కదిరిచేని రెడ్డెమ్మ మాట్లాడుతూ ఎంపీటీసీల రిజర్వేషన్ లేకుండా మండల అభివృద్ధి నిధులను పంచాయతీలకు కేటాయిస్తున్నారని, ఎంపీటీసీలకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా బిల్లు పెట్టమని, పంచాయతీల పరిధిలో చేసిన పనులకు మాత్రమే బిల్లులు చేస్తామని కొంతమంది ఎంపీటీసీల ప్రశ్నలకు ఎంపీడీవో సుధాకరరెడ్డి సమాధానమిచ్చారు. అయితే రాయవరం సచివాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.8 లక్షలు ఎలా కేటాయించారని ఎంపీటీసీలు ప్రశ్నించారు. మండల రిజర్వేషన్ తీసుకొని అనుమతులు ఇచ్చామని, మీరు కూడా పనులు చేసి చూపిస్తే బిల్లులు పెడతామని ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎంపీటీసీలు సభాభవనం నుండి వెళ్లిపోయారు. అనంతరం ఎంపీపీ వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. అధికారులందరూ వెళ్లిపోయిన తర్వాత తిరిగి ఎంపీటీసీలు సభా భవనానికి వచ్చారు. మొత్తానికి పనుల కోసం, నిధుల కోసం ఎంపీటీసీల ఆందోళన మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశంలో సమస్యలను ప్రస్తావించకుండానే ముగిసింది. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సురేశ్‌బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఇర్ఫాన్ అహ్మద్, ఏవో మహబూబ్‌బాషా, పింఛా ప్రాజెక్టు ఈఈ నాగేంద్రనాయక్, డిప్యూటీ రేంజర్ రమేశ్‌బాబు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజమ్మ

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో శేఖర్

రాజంపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని రాజంపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్ అన్నారు. గురువారం రాజంపేటలో వైద్య సిబ్బందికి జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో పేద, బలహీన, మధ్య తరహా, అన్నివర్గాల ప్రజలకు మంచి జరగాలన్న ఉద్దేశంతో జీఎస్టీని భారీగా తగ్గించడం జరిగిందన్నారు. దీంతో సరసమైన ధరలకే విలాసవంతమైన వస్తువులు లభిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఏయే వస్తువులపై ఎంతమేర జీఎస్టీ తగ్గించారో దాని వల్ల వారికి కలిగే ప్రయోజనమేమిటో వివరించాలన్నారు.

మందులపై తగ్గిన జీఎస్టీ

నందలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ మందులపై తగ్గిన జీఎస్టీని తెలుసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీలు సులోచన, మల్లీశ్వరి, హిమబిందు పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అవరపల్లెలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందులషాపుల్లో ఎవరైనా ఎక్కువ జీఎస్టీని వసూలు చేస్తే వెంటనే ప్రశ్నించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకెంతో మేలు

గాలివీడు, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ అమలుతో ప్రజలకెంతో మేలు చేకూరుతుందని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని నూలివీడు గ్రామ పంచాయతీ పరిధిలో మెడికల్, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎస్టీ వలన వైద్య పరికరాలు, మందులపై రేట్లు బాగా తగ్గాయని, ప్రాణాంతక వ్యాధుల మందులపై మధ్య తరగతి కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

రామాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని కేంద్రం రెండు స్లాబులుగా పరిష్కరించిందని ఎంపీడీవో జాషువా, డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీపై గురువారం ఆరోగ్య సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, మందులపై జీరో శాతం జీఎస్టీ అమలులోకి తెచ్చిందన్నారు. రైతులకు మేలు చేసే పరికరాలపై 8 నుంచి 5 శాతం తగ్గించారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో రెడ్డెయ్య, కస్వేటి ఆసుపత్రి సూపరింటెండెంట్ సులోచన తెలిపారు. గురువారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో సూపర్ జీఎస్టీపై ప్రజలు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై వైద్య రంగంలో ఔషధాలపై, వివిధ ల్యాబ్ పరీక్షలపై, అత్యవసర మందులపై తగ్గించిన జీఎస్టీ సుంకం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.


నందలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

జీఎస్టీలో సవరణలపై కేంద్రానికి ప్రజల మన్ననలు

● రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పుల్లెల రమేశ్

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో సవరణలు తీసుకురావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయని రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పుల్లెల రమేశ్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ సూపర్ గిఫ్ట్ ఇచ్చిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో జీఎస్టీలో సవరణలు తీసుకొచ్చారని తెలిపారు. 99శాతం వస్తువుల పైన పన్నులు తగ్గాయన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సాయి, బాలక్రిష్ణంరాజు, సీహెచ్‌వో లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.


జీఎస్టీ గురించి వివరిస్తున్న పుల్లెల రమేశ్

ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన

రాజంపేట టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లపై జరిగిన వరుసదాడులకు నిరసనగా గురువారం ఆర్టీసీ డిపో వద్ద అద్దె బస్సుల డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ నిరసనకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ కార్మిక నాయకులతో కలిసి మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్‌పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆర్టీసీలో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే డ్రైవర్లకు ఎలాంటి రక్షణ ఉంటుందో యాజమాన్యం నుంచి తమకు కూడా అటువంటి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన 9 డిమాండ్లను ఈనెల 20వ తేదీలోపు పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అద్దె బస్సులను నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పీవీ రమణ, ఎం.రమణ, లక్ష్మీదేవి, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మంత్రిని కలిసిన రాజంపేట ఐఎంఏ సభ్యులు

రాజంపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): త్వరలో రాజంపేటలో నిర్వహించనున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రాజంపేట ఐఎంఏ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలో తన కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈ సమావేశంలో డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలు, అంశాలపై చర్చించడం జరుగుతుందని సభ్యులు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో రాజంపేట ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ నవీన్, రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ హరిరావు, తదితరులు ఉన్నారు.


మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం























పెనగలూరులో భారీ వర్షం

పెనగలూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా గురువారం సాయంత్రం మూడు గంటల నుంచి నాలుగు గంటల దాకా పెనగలూరులో భారీ వర్షం కురిసింది. వర్షపునీరు వీధుల్లో కాలువల్లాగా ప్రవహించింది. వర్షం ఆగిపోయిన తర్వాత చాలాసేపు ఆకాశంలో ఉరుములు మెరుపులు అలజడి సృష్టించాయి. వీధులలో అర్ధ అడుగు మేర నీరు ప్రవహించే విధంగా వర్షం కురిసిందని స్థానికులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

ఒంటిమిట్ట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి నిరసనగా గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనరసయ్య, చంద్రపాల్, చంద్రబాబు, కృష్ణయ్య, కత్తి చంద్ర, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, మధు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నిమ్మనపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికను మాయమాటలతో బలాత్కారం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ ఓ గ్రామానికి చెందిన బాలిక (17) మదనపల్లిలోని ఓ కళాశాలలో చదువుతోంది. రోజు బస్సులో మదనపల్లికి వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొరివి శంకర కుమారుడు కళ్యాణ్ ఆ యువతిని ప్రేమ పేరుతో ఆమె వెంట తిరుగుతూ వేధించేవాడని తెలిపారు. పది రోజుల కిందట బలవంతంగా ద్విచక్రవాహనంపై తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారన్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆ యువతిని గట్టిగా ప్రశ్నించగా తనను కళ్యాణ్ బెదిరించి నెల రోజుల కిందట బోయకొండ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి బలవంతం చేశాడని తెలిపింది. దీంతో స్థానిక పోలీసులకు బాధిత తండ్రి ఫిర్యాదు చేయడంతో కళ్యాణ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ


గల్లా నాగరత్నమ్మ

గుర్రంకొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని తాగడానికి మంచి నీళ్లు అడిగి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లిన సంఘటన బుధవారం సాయంత్రం నడిమిఖండ్రిగలో చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. మండలంలోని నడిమిఖండ్రిగ వాసి గల్లా నాగరత్నమ్మ అదే గ్రామంలో ఉన్న కుమార్తె వద్ద ఉంటూ జీవిస్తోంది. గ్రామంలోని శ్రీనివాస్ డాబా పక్క నున్న మామిడి తోటలోని ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని యువకులు వచ్చి తాగడానికి మంచి నీళ్లు అడిగారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలు ఇంట్లోకి నీళ్లకోసం వెళుతుండగా వెనుక నుంచి మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఈ క్రమంలో వృద్ధురాలు కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు వృద్ధురాలికి సపర్యలు చేయడంతో తేరుకుంది. దీంతో జరిగిన విష యాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులకు చెప్పడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

దేవుని మాన్యాలకు రక్షణ కల్పిస్తాం

● జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్


ప్రహరీగోడను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఏసీ విశ్వనాథ్

సుండుపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుని మాన్యాలకు రక్షణ కల్పిస్తామని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సుండుపల్లెమ్మ మాన్యాన్ని ఆయన పరిశీలించారు. 2127 సర్వే నెంబర్‌లో 4.40 ఎకరాల భూమి ఉందని, ఇది సుండుపల్లెమ్మ మాన్యంగా రికార్డుల్లో ఉందన్నారు. అయితే కొంతమంది ఎన్‌వోసీ కోసం వినతిపత్రం అందించారని, కానీ ఎన్‌వోసీ ఇవ్వలేదన్నారు. ఈ స్థలం 9 మంది ఆధీనంలో ఉందని తెలిసిందన్నారు. సుండుపల్లెమ్మ దేవస్థానం దేవదాయశాఖలో పబ్లికేషన్ కాలేదని, 2127 సర్వే నెంబర్‌లో కొంతమంది రిజిస్ట్రేషన్, ఇంకొందరికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయని, వీరికి నోటీసులు జారీ చేస్తామన్నారు. పై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే శివాలయాన్ని సందర్శించినప్పుడు ఆలయం ప్రహరీగోడ వర్షాలకు పడిపోయిందని, పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని, అలాగే రెండు ధ్వజస్తంభాలు తుప్పు పట్టాయని, నూతనంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని గ్రామస్థులు కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో మలేరియా నివారణపై పోస్టల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాపునీరు నిలబడే చోట లార్వా చేసుకొని దోమలు ఎక్కువై మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామాల్లో పోస్టర్లు వేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పల్లెలోనూ ఆరోగ్య కార్యకర్త లార్వా సర్వే నిర్వహించి కొబ్బరి చిప్పల్లో, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతిరోజు గ్రామలను సందర్శించి జ్వరాలు వచ్చిన వారికి చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై కొనసాగుతున్న దాడులు

● నిందితుడు అరెస్టు ● 51 మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగుతున్నాయి. ములకలచెరువు కేంద్రంగా జరుగుతున్న నకిలీ మద్యం గుట్టరట్టు కావడంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగిస్తున్నారు. తాజాగా గురువారం స్థానిక పోలీసులు మండలంలోని కాలువపల్లె పంచాయతీ బుద్దలవారి పల్లెలో దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేశారు. అతని నుంచి 51 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సీఎంతో ముక్కా

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కోడూరు-వెంకటగిరి, సోమశిల బ్యాక్‌వాటర్, నియోజకవర్గంలో చేయాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లతో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రైల్వేకోడూరు ప్రచారంలో కోడూరు-వెంకటగిరి రోడ్డు, పెనగలూరు వద్ద సోమశిల బ్యాక్‌వాటర్ ఎత్తిపోతల పథకంపై ప్రజలకు హామీ ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయాలని కోరామన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి రావాల్సిన అభివృద్ధి కార్యక్రమాల నివేదికను అందించామన్నారు. అలాగే కోడూరు ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు డయాలసిస్ కోసం రోగులు వెళుతున్నారని, రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించామని తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారని ముక్కా తెలిపారు.


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చిస్తున్న ముక్కా

బావ అండతో.. చెలరేగిన బావమరిది..


క్వారీలో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

- అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ
- సీజ్ చేసి విచారణ చేపట్టిన గనులశాఖ అధికారులు
- 5 ఎకరాలకు దరఖాస్తు.. 10 ఎకరాలకు పైగా ఆక్రమణ
- మంత్రి గిరిధర్‌రెడ్డి దందా

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం కేసులో పాత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బావ, బావమరుదులు చేసిన నిర్వాకం మరొకటి బయట పడింది. టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఇన్నాళ్లు ఉన్న జయచంద్రారెడ్డి అధికారం అండతో ఆయన బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డి వివిధ శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండానే దర్జాగా క్వారీ మొదలు పెట్టేసి రూ.లక్షల విలువ చేసే కంకరను అమ్ముకున్నారు. ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం కేసులో జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి కార్యకలాపాలపై ప్రభుత్వం తీవ్ర స్థాయిలో దృష్టి సారించింది. ఈ క్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇన్ని రోజులు జరిగిన అనేక అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట పంచాయతీ పరిధిలో వీళ్లు నిర్వహిస్తున్న క్రషర్‌ను గురువారం గనుల శాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించి సీజ్ చేశారు.


తవ్వకాలపై సర్వే చేస్తున్న మైన్స్ సర్వేయర్లు

అనుమతులు లేకుండానే..

సాధారణంగా క్వారీ ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, గనుల శాఖల అనుమతులు కావాలి. అదో పెద్ద తతంగం. అయితే గిరిధర్‌రెడ్డి నడుపుతున్న తుమ్మనంగుట్ట క్వారీ విషయంలో ఇవేవి పూర్తి స్థాయిలో జరగనట్లు మైన్స్ అధికారులు గుర్తించారు. గిరిధర్‌రెడ్డి తుమ్మనంగుట్ట శివారులో సర్వే నెంబరు-111లో ఉన్న 82 ఎకరాలపైకి ఐదు ఎకరాలు లీజుకు ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. దీనికి పూర్తి స్థాయిలో వివిధ శాఖల నుంచి అనుమతులు రాకుండానే మరో ఐదు ఎకరాలు పెంచాలంటూ అధికారులను కోరితే అందుకు అధికారులు సమ్మతించలేదు. దీనిపై జయచంద్రారెడ్డి గనులశాఖ మంత్రి టి.జి భరత్‌కు లెటర్ రాసి అలినేషన్ కింద భూమి కేటాయించాలని కోరారు. ఆ పని ఏదో చేసి పెట్టాలని టీజీ భరత్ ఏపీఐఐసీకి లెటర్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఏపీఐఐసీ నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు, అక్కడి నుంచి బి.కొత్తకోట తహసీల్దార్‌కు రిట్కో కంపెనీ దరఖాస్తు పరిశీలించాలని ఆదేశాలు అందాయి. దీనిపై ఆగమేఘాల మీద అనుకూలంగా నివేదిక ఇవ్వాలని అప్పటి వీఆర్‌వోపై ఒత్తిడి తెచ్చారు. ఆయన అందుకు అంగీకరించకపోవడంతో ఆయనను కలెక్టర్‌కు సరెండర్ చేశారు. అంతా తమ చేతిలో ఉందిలే ఎవరు వస్తారు.? ఏమవుతుంది..అన్న ధీమానో ఏమో అనుమతులు రాకుండానే మిషనరీ తెచ్చేసి క్రషింగ్ మొదలు పెట్టేశారు. అనుమతుల విషయం పట్టించుకోకుండా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. అయితే పరిస్థితి ఒకసారిగా తారుమారు కావడంతో గురువారం మైన్స్ ఏడీ రంగకుమార్, తహసీల్దార్ బావాజాన్‌లు తమ సిబ్బంది, పోలీసుల సాయంతో తుమ్మనంగుట్ట వద్దకు వెళ్లి క్వారీని సీజ్ చేశారు. మైన్స్ ఆర్ఐ విజయకుమారి, సర్వేయర్ మాధవీలత, ములకలచెరువు రఫి, ముబారక్ తదితరులు క్వారీలో కొలతలు వేసి విచారణ చేపట్టారు. క్వారీలో ఎన్ని క్యూబిక్ మీటర్లు తవ్వారు? ఎన్ని వేల యూనిట్ల కంకర తీసి ఉంటారు? ప్రస్తుతం ఉన్న స్టాకు ఎంత? అనే వివరాలను నమోదు చేశారు. ఇది ముమ్మాటికీ అక్రమ క్వారీ యేనని తేల్చారు. మైన్స్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పర్యావరణ శాఖ అనుమతులు లేకుండానే విద్యుత్ శాఖాధికారులు ఎలా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారో అర్థం కావడం లేదని పరిశీలనకు వెళ్లిన అధికారులు విస్తుపోయారు. ప్రస్తుతం ఈ క్వారీలో 6415 క్యూబిక్ మీటర్ల కంకర నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీనిలో డస్ట్ నుంచి 20 ఎంఎం వరకు వివిధ రకాలుగా ఉన్న సరుకును సీజ్ చేశారు. రాష్ట్ర గనుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకే ఈ దాడులు జరిగినట్లు సమాచారం.

ఇద్దరు పీఆర్ డీఈఈలకు ఇంక్రిమెంట్ల కోత

● ఒక ఏఈఈకి విముక్తి

కలికిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దముడియం మండలం సుద్దపల్లె ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ నిథులతో చేపట్టిన సమగ్ర అభివృద్ధి పథకాల అమల్లో తీవ్రమైన అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లకు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2017లో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల్లో జరిగిన అక్రమాలతో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఇద్దరు డీఈఈలు, ఒక ఏఈపై అభియోగాలు నమోదు చేసి 2017 జూలై 25న ప్రభుత్వానికి తదుపరి చర్యల కోసం నివేదించారు. దీని పైన పలు దఫాలు జరిగిన విచారణలు, సంజాయిషీల అనంతరం ఎనిమిదేళ్ల తరువాత తుది చర్యల ఉత్తర్వులు జారీ అయ్యాయి. అప్పట్లో జమ్మలమడుగు డీఈఈగా పనిచేసి ప్రస్తుతం కడప సబ్ డివిజన్ కమలాపురం క్వాలి టీ కంట్రోల్ డీఈఈగా పనిచేస్తున్న పి.వెంకట్రావు, ప్రస్తుతం ప్రొద్దుటూరు పీఆర్ఐ డీఈఈగా పనిచేస్తూ అప్పట్లో జమ్మలమడుగు క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈగా వున్న టి.గోపాల్ దాస్‌పై ఆరోపణలు రుజువు కావడంతో ఇద్దరికి ఒక వార్షిక ఇంక్రిమెంట్ (క్యుములేటివ్ ప్రభావంతో) వంతున కోత విధించారు. ఇందులో వీరితో పాటు ఆరోపణలు ఎదుర్కొన్న అప్పటి జమ్మలమడుగు క్వాలిటీ కంట్రోల్ విభాగం ఏఈ ఎం.డి.సుబ్బారెడ్డి (ప్రస్తుతం రిటైర్డు)పై మాత్రం తదుపరి చర్యలను ఉపసంహరించారు. ఇద్దరు డీఈఈలు తీవ్రమైన అక్రమాలకు పాల్పడి పనుల్లో నాణ్యత లేకుండా, కొలతల్లో భారీ తేడాలతో అన్ని సాంకేతిక నియమాలను విస్మరించిన కారణంగా అప్పట్లోనే ప్రభుత్వ ఖజానాకు రూ.11,40,983లు నష్టం వాటిల్లినట్లు విచారణలో రుజువైంది. దీంతో చివరగా ఇద్దరు డీఈఈలకు ఒక్కో వార్షిక ఇంక్రిమెంటు వంతున కోత విధిస్తూ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుతో ఎస్పీ భేటీ


ఆర్టీసీ ఎండీతో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావును గురువారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కలిశారు. మదనపల్లెలోని వెన్నెల గార్డెన్‌లో ప్రజారవాణా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై వారు చర్చించారు. జిల్లాలో బస్సుల ప్రయాణీకుల భద్రతను మరింత పెంచాలని, బస్సు స్టేషన్‌ల్లో భద్రత చర్యలు పటిష్టం చేయాలని చర్చించుకున్నారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు నిరంతరం సురక్షితమైన, నమ్మకమైన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడంలో ఎస్పీ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళా ప్రయాణికుల రక్షణకు పోలీస్‌శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని అందిస్తామన్నారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేసన్‌ను గురువారం ఎస్పీ ధీరజ్ తనిఖీ చేశారు. ఎస్పీగా నియమితులైన మొదటసారి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు విచ్చేసి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, తాలుకా సీఐ మహమ్మద్ రఫీ, ఎస్సైలు అన్సర్‌బాషా, శివకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలతో రాష్ట్రంలో అలజడులు

● టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న నరసింహప్రసాద్

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ కుట్రలతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులోని ఆయన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ పెద్దల నుంచి వచ్చిన డైరెక్షన్‌తోనే చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపల్లె వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ నేతలు నిప్పు పెట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలో వైసీపీ సర్పంచ్ గోవిందయ్యతో పాటు పలువురు పాల్గొన్న విషయం సాక్ష్యాధారాలతో సహా బట్టబయలైందన్నారు. దళిత సంఘాలు, ప్రజా సంఘాలు వైసీపీ చేస్తున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంబేడ్కర్ భావజాలం భావితరాలకు మార్గనిర్దేశంగా చేయాలన్న ఉద్దేశంతో ఆయన విగ్రహాలను ఊరూరా నెలకొల్పుతున్నారని, అటువంటి మహనీయుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి రాజకీయ లబ్ధి పొందాలని అనుకోవడం దళితులను అవమానపరచడమేనన్నారు. సీసీ కెమెరాలు, ఫోన్ లోకేషన్, కాల్ లిస్టుల ఆధారంగా స్పష్టంగా వైసీపీ నేతల బాగోతం బట్టబయలైందన్నారు. కూరత్వమే తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లె ప్యాలెస్‌లో ఉన్నారని విమర్శించారు. రాజ్యాంగమన్నా, ప్రజాస్వామ్యమన్నా లెక్కచేయని క్రూర స్వభావి జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఉండటానికి అర్హుడు కాదన్నారు. జగన్ ఇంకెంత కాలం దళితుల పేరు చెప్పి కుట్ర రాజకీయాలు చేస్తావని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని విధ్వంసాలు చేయాలని ప్రయత్నించినా తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. వైసీపీ హయాంలో 56వేల మంది దళితులపై దాడులు, 192 మందిని హత్య చేశారని స్వయంగా రాజ్యసభలో కేంద్రం వెల్లడించిందని, ఇవన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

విద్యార్థుల గైర్హాజరును నమోదు చేయాలి

● స్కూల్ కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరును రిజిష్టర్‌లో నమోదు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఆల్టర్నేట్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఉవల వెంకట్రామయ్య తెలిపారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని, పాఠశాలల్లో దీర్ఘ గైర్హాజరు విద్యార్థుల పునఃప్రవేశం, డ్రాపౌట్ విద్యార్థులు లేకుండా చూడడం ప్రధానోపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. ఒక విద్యార్థి మూడు రోజుల పాటు వరుసగా గైర్హాజరైతే వెంటనే తల్లిదండ్రులతో సంప్రదించాలని సూచించారు. విద్యార్థి తిరిగి పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి, సీఆర్‌పీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అనంతరాజుపేట హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకట్రామయ్య

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ


పుల్లంపేట ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మెమోరాండంతో ఉపాధ్యాయులు

పుల్లంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ప్యాప్టో నాయకులు సీవీ రమణమూర్తి, సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మార్వోలో మెమోరాండం సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులతో ఎటువంటి బోధనేతర పనులు చేయించమని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యాశక్తి, జీఎస్టీ 2.0, గూగుల్ సీట్లు నింపడం తదితర పనులు చెప్పడం తగదన్నారు. బోధనేతర పనుల వల్ల విద్యార్థులకు బోధన ఆటంకం కలగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్యాప్టో నాయకులు సిద్దయ్య, ఎస్వీ రమణ, శివరాంప్రసాద్, మునగపాటి శ్రీను, మాదవమూర్తి, ఎస్ఎండీ గౌస్, నాగభూషణం, పెంచలయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కేసులోని ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు


తాళాలు పగులగొడుతున్న దృశ్యం

మదనపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్బారెడ్డి లేఅవుట్‌లో ఓ ఇంటి విషయమై ఇరువర్గాల మధ్య 2011 నుంచి కోర్టులో కేసు నడుస్తోంది. ఇదే ఇంటిని స్వాధీన పరచాలంటూ 2024లో పట్టణానికి చెందిన జరీన్, చలపతి, దేవప్రకాష్, రవి కుమార్, గంగరాజుపై మరో కేసు వేశారు. 17ఏళ్లుగా దేవప్రకాష్, రవి కుమార్ స్వాధీనంలో ఇల్లు ఉంది. ఇంట్లో ఎనిదేళ్లగా అద్దెకు ఉంటున్న గంగరాజు ఈనెల 2న ఇల్లు ఖాళీ చేసి తాళాలు యజమాని దేవప్రకాష్‌కు అప్పగించాడు. ఇల్లు ఖాళీ అయిన విషయం తెలుసుకు న్న ఓ వర్గం తన అనుచరులతో వెళ్లి ఇంటిని తమకు అప్పగించాలని, లేకుంటే కూల్చేస్తామని దేవప్రకాష్‌ను బెదిరించాడు. బుధవారం రాత్రి మరోసారి వివాదాస్పద ఇంటికెళ్లి దౌర్జన్యంగా ఇంటికి వేసిన తాళం పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడు. బాధితుడు దేవప్రకాష్ పోలీసులను ఆశ్రయిస్తే ఇరువర్గాలను గురువారం స్టేషన్‌కు పిలిపించి రికార్డులు, కోర్టు పత్రాలను పరిశీలించి బాధితుడిని ఇంట్లోకి వెళ్లవద్దంటూ పోలీసులు ఆదేశించారు. ఇంటిని సంబంధం లేని వ్యక్తులు కబ్జాకు ప్రయత్నించారని పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోగా, తమ అనుభవంలోని ఇంట్లోకి తమను ప్రవేశించవద్దని సూచించడం ఏంటని బాధితులు వాపోయారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి

రాయచోటిటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజాన్ని నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని జాతీయ పొగాకు నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి కోరారు. గురువారం పట్టణంలోని డైట్ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు మనిషి ఆయుష్షు క్షీణిస్తోందన్నారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు శివభాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు బీఎస్ పద్మావతి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

చిన్నమండెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ క్లాప్ మిత్రలకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. గురువారం మండల కేంద్రంలోని దేవపట్ల రోడ్డులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద క్లాప్ మిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 680 ప్రకారం కనీసం రూ.10 వేల వేతనం చెల్లించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు చెల్లించాలని, రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డెయ్య, నరసింహులు, రెడ్డెప్ప, వెంకటరమణ, నరసింహ, శాంతికుమారి, అంజనమ్మ, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల ఎంపిక బాధ్యత వీవోలదే

● ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి



యానిమేటర్ల అసోసియేషన్ ప్రతినిధులకు ఉత్తర్వులు అందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు, సెర్ప్‌కు వారధిగా విధులు నిర్వహిస్తున్న గ్రామ సమాఖ్య సహాయకుల ఎంపిక బాధ్యత గ్రామ సమాఖ్యలదే. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి గురువారం ఒక మెమో విడుదల చేశారు. గ్రామ సమాఖ్య సహాయకుల పదవీ కాలాన్ని మూడేళ్ల పాటు ఉండేలా గత ప్రభుత్వం హయాం (2019 డిసెంబరు 1) నుంచి అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన తరువాత గ్రామ సమాఖ్య సహాయకుల మూడు సంవత్సరాల పదవీకాలం నిబంధనలను నిలుపుదల చేస్తూ చర్యలు తీసుకున్నారు. అదే విధంగా గ్రామ సమాఖ్య సహాయకులను ఎంపిక చేయడం, తొలగించడం గ్రామ సమాఖ్యల బాధ్యతలను ఆమె మెమోలో పేర్కొన్నారు. గ్రామ సమాఖ్య తీర్మానాన్ని సంబంధిత ఏపీయం డీఆర్‌డీఏ పీడీకి తెలియపరచాల్సి ఉంటుంది. ఏదైనా ఆర్థిక నేరాలకు పాల్పడితే అలాంటి వీఏవోలపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకునే అర్హత డీఆర్‌డీఏ పీడీకి ఉంటుందని వివరించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆమె తెలిపారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



దౌలతాపురంలో భూముల రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్న రీసర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా సర్వే శాఖ అసిస్టెంటు డైరెక్టరు మురళీక్రిష్ణ అన్నారు. మండలంలోని దౌలతాపురం రెవెన్యూ గ్రామంలో చేపట్టనున్న రీసర్వేను ఏడీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి రైతులతో మాట్లాడారు. సర్వే నెంబర్లు 44, 45, 46లలో సర్వే ఎలా జరుగుతోందని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూముల మధ్య రాబోవు కాలంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్త కుండా ఉండేందుకే రీసర్వే చేపడుతోందన్నారు. బ్రిటీష కాలంలో చేపట్టిన సర్వే తప్ప రాష్ట్రస్థాయిలో ఇంత వరకు భూసర్వే ఇంత వరకు జరగలేదన్నారు. సర్వే అధికారులకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించి తమ భూము లకు సంబంధించి కొలతలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, మండల సర్వేయరు ఖాజాహుసేన్, సర్వే డీటీ అర్చన, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలుపాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పునకు స్థల పరిశీలన



వేంపల్లెలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి బస్టాండ్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికార బృందం

వేంపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప బైపాస్‌రోడ్డులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేసేందుకు అధికారుల కమిటీ పరిశీలన జరిపింది. గండి రోడ్డులో ఉన్న ప్రైవేటు భవనాలను, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కమిటీ ప్రతినిధులు పరిశీలించారు. వేంపల్లెలో ఉన్న కార్యాలయాన్ని మార్చాలని స్థానిక టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌ను కోరారు. వారి అభ్యర్థన మేరకు గండిరోడ్డులో ఉన్న భవనాలను జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు, ఫైర్ ఆఫీసర్ శివరామిరెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ నాగేంద్ర, ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్ తదితర అధికారుల బృందం పరిశీలించారు. గండిరోడ్డులో ఉన్న ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. అలాగే బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి ద్వారా కలెక్టర్‌ను కోరారు. బస్టాండ్ సమీపంలో ఉన్న స్థలంలో కార్యాలయాన్ని ఉచితంగా నిర్మించి ఇస్తామని బీజేఏ నాయకులు గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి మేరకు బస్టాండ్ వద్దనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ వివరాల నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

13 నుంచి క్రీడా టాలెంట్ హంట్

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈ నెల 13 నుంచి 16 వరకు అండర్ 12, 14, 16, 19 పురుష క్రీడాకారులకు టాలెంట్‌హంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ సభ్యుడు కె.రవి శంకర్ ఎంపికలకు హాజరై క్రీడాకారుల నైపుణ్యాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి తదుపరి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆ మేరకు ఈనెల 13న అండర్ 12, 14న అండర్ 14, 15న అండర్ 16, 16న అండర్ 19 క్రీడాకారులు తప్పక హాజరుకావాలన్నారు. క్రీడాకారులు తమ కిట్ బ్యాగులతో పాటు ఆధార్, బర్త్ సర్టిఫికెట్, ప్రెజంట్ స్టడీ సర్టిఫికెట్‌తో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరు కావాలన్నారు.

'వైద్య విద్య ప్రైవేట్‌పరం ఎన్టీఆర్ ఆశయాలకు విరుద్ధం'

వేంపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయడం స్వర్గీయ ఎన్టీరామారావు ఆశయాలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందులలో మెడికల్ కళాశాలకు రూ.400 కోట్లు ఖర్చు చేశారన్నారు. మరో వంద కోట్లు ఖర్చు చేసి ఉంటే నిర్మాణాలు పూర్తయ్యేవన్నారు. అయితే నర్సింగ్ కళాశాల భవనాలలో వైద్య విద్యార్థులకు తరగతులు నిర్వహించవచ్చు, ఆసుపత్రికి సంబంధించి వందశాతం పూర్తయిందన్న ఉద్దేశ్యంతో ఎన్‌ఎమ్‌సీ పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం ద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు.

15లోగా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

● విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్స్‌ను పరిష్కరించకపోతే అక్టోబరు 15వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళతామని స్ట్రగుల్‌కమిటీ ప్రధాన కార్యదర్శి వి.సుబ్బి రెడ్డి విద్యుత్ యాజమాన్యాలను హెచ్చరించారు. విద్యుత్ కార్యాలయాలు జనరేటింగ్ స్టేషన్లలో అక్టోబరు 14న వర్క్‌టు రూల్ పాటిస్తామన్నారు. ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో గురువారం కార్మికుల, ఉద్యోగులతో ఉద్యమ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ సంస్థల్లో సుమారు 27వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నా రన్నారు. దశాబ్దాలుగా చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. తెలంగాణలో 16వేల మంది విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేశారన్నారు. అయితే ఏపీలో పర్మనెంట్ పక్కనబెడితే జీతాలు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్నట్లుగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు పీఆర్సీ బకాయిలు నేటికి చెల్లించడం లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 4డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యుత్ రంగంలోని కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందని, అవి పరిష్కారం కావాలంటే ఉద్యమాలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు వి.గంగయ్య, డి.పుల్లారెడ్డి, రాజు, శివప్రసాద్, వెంకటరమణ తదితరులు ప్రసంగించారు.

ఆర్టీపీపీ యాష్ సమస్యను పరిష్కరిస్తాం...సీఈ



ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు

ఎర్రగుంట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ సమస్యకు పరిష్కారం చూపుతామని చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్లాంట్‌లో యాష్‌ను నియంత్రించే ఈఎస్‌పీ తదితర యాంత్రాల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా దుమ్మురాకుండా చేస్తామన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో వస్తున్న యాష్ కాలుష్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడుగ్గా రోడ్లపైన, ఎక్కడపడితే అక్కడ ఫ్లైయాష్ డంప్ చేయకుండా చర్యలు చేపడతామన్నారు. వాటిపై ప్రత్యేక చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆర్టీపీపీ 600, ట్యాంకర్ల గేటు వద్ద రోడ్లపై ఆపుతున్న వాహనాలను ఆపకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 210 మెగావాట్ల సామర్థ్యంగల 5వ యూనిట్ 5వ తేదీ ఓవరాలింగ్ నిమిత్తం ఆపినట్లు తెలిపారు. 20రోజుల్లో పూర్తి చేసి మరో రెండు యూనిట్లను కూడా ఓవరాలింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్‌కు డిమాండ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా అందుకు తగ్గట్టుగా ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. గురువారం వెయ్యి మెగావాట్లకు పైబడి ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ప్లాంటుల్లో సుమారు 2లక్షలకుపైబడి బొగ్గు నిల్వలున్నట్లు తెలిపారు. బొగ్గు సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నాం

● ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్ బాష



డీఈఓ కార్యాలయం ఏడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ విద్యారంగంలో అవలంబిస్తున్న ప్రయోగాత్మక విధానాలు, తిరోగమన చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఇలియాస్ బాష, సెక్రటరీ జనరల్ రాళ్లపల్లె అబ్దుల్లా తెలిపారు. గురువారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు కడప జిల్లా పరిపాలన అధికారి విజయ్ కుమార్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణలను ఫ్యాప్టో నేతలు కలిసి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాటట్లాడుతూ జూన్ నుంచి యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్, జీఎస్టీ 2.0 పేరుతో మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయడం, విద్యాకానుకల పంపిణీ, రోజువారి నివేదికలను ఎంఈఓ కార్యాలయానికి పంపడం వంటి కార్యక్రమాలు ఉపాధ్యాయులపై భారీ భారం మోపుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అసెస్‌మెంట్ పుస్తకాలు, టీచర్ హ్యాండ్‌బుక్ వంటి పనులతో బోధనకు ఆటంకం కలుగుతోందని, ఉపాధ్యాయులను తరగతి బోధన నుంచి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, పాఠ్యాంశాల బోధన తప్ప ఇతర బోధనేతర కార్యక్రమాలను పూర్తిగా బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్ కిరణ్, జిల్లా నాయకులు మాదన విజయ్ కుమార్, ఖాదర్‌బాష, శ్యామలాదేవి, సుబ్బారెడ్డి, జ్యోతి, రామచంద్రబాబు, జుబేర్ అహ్మద్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ... వృద్ధురాలికి గాయాలు

సీకేదిన్నె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులివెందుల రోడ్డులో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వెంగమాంబ అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. వేంపల్లె నుంచి కడపకు వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు పులివెందుల రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గురువారం మలుపు తీసుకుంటుండగా వెంగమాంబ అనే మహిళ వెనుకభాగంలో తగిలి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. వృద్ధురాలిని బస్సు డ్రైవర్ హుటాహుటిన ఆటోలో ఎక్కించుకుని చికిత్స అందించేందుకు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు?

లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో దొంగతనం చేసి పారిపోయిన మాబాష, హసీనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకెళితే .... జనవరిలో అనంతపురం నుంచి వచ్చామని పార్నపల్లె గ్రామానికి చెందిన రాధ మహిళ ఇంట్లోకి అద్దెకు దిగారు. కొన్ని నెలలు ఆమెతో మంచిగా ఉంటూ నమ్మించారు. ఆగస్టు నెలలో రాధ తోట వద్దకు వెళ్లిన తర్వాత ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి రూ.1.10లక్షల నగదు, 9గ్రాముల బంగారం, వెండి పట్టీలు దొంగలించి పారిపోయారు. ఎట్టకేలకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

జీఎస్టీ రేట్ల తగ్గింపుపై అవగాహన

కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప ఐఎంఏ కార్యాలయంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టాల్‌ను ఏర్పాటు చేసి జీఎస్టీ రేట్ల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్నూల్ డ్రగ్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగ కిరణ్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.రవిబాబు స్టాల్‌ను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత నెల 22వ తేదీ నుంచి వినియోగదారునికి మేలు జరిగేలా జీఎస్టీలో భారీ మార్పులు చేసిందన్నారు. అందులో భాగంగా 12శాతం నుంచి 5శాతానికి తగ్గించిందన్నారు. అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

అరటి తోటను పరిశీలించిన జర్మన్ శాస్త్రవేత్తలు

లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కులగారిపల్లెలో గురువారం జర్మనీ శాస్త్రవేత్తలు షర్వినాబుష్, జెరాల్డ్ రెహ్మాన్‌లు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న అరటితోటను పరిశీలించారు. గ్రామానికి చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా అరటి పంటను పండిస్తున్నారు. శాస్త్రవేత్తలు అరటి తోటను పరిశీలించి సాగులో యాజమాన్య పద్ధతులను, పంట దిగుబడిపై రైతును అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పార్నపల్లె విద్యార్థులు





లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండలంలోని పార్నపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానో పాధ్యాయుడు అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ అండర్-19 విభాగంలో 10వ తరగతి చదువుతున్న నాగచైతన్య సాఫ్ట్‌బాల్ పోటీలకు, అండర్-17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న ప్రేమ్, హరి హరణ్ బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కృషిచేసిన పీడీ విక్టర్‌ను, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రతి ఖాతాదారునికి నాణ్యమైన సేవలు



మాట్లాడుతున్న ఏజీఎం రవికుమార్

కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ఖాతాదారునికి నాణ్యమైనసేవలు అందించాలని భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గెల్లా రవికుమార్ అన్నారు. గురువారం కడప సెవెన్‌రోడ్స్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారునికి అవసరమైన సేవలను అందించడం, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సరైన సమయంలో సేవలను అందిస్తున్న ఏకైక బ్యాంకు భారతీయ స్టేట్ బ్యాంక్ అని అన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు తెలియని నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తే ఓటీపీలను చెప్పకూడదని ఖాతాదారులకు సూచించారు. అంతే కాకుండా సైబర్ నేరాలపై ఏమైన అనుమా నాలు ఉంటే 1930కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. నకిలీ కాల్స్‌పట్ల పూర్తి అప్రమత్తతో ఉండాలన్నారు. ఏమైన ఖాతాలపై అనుమానాలు ఉంటే నేరుగా బ్యాంకు సిబ్బంది వద్దకు వచ్చి వారి నివృత్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. బ్యాంకు మేనేజర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ మోసపూరిత కాల్స్‌పై స్పందించ రాదని తెలిపారు. లింకులపై ఎలాంటి క్లిక్కులు చేయకుండా జాగ్రత్త ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి, డిప్యూటీ మేనేజర్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 26.3 టీఎంసీల నీటిమట్టం



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో గురువారం 26.376 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమా మాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వా యిర్ నుంచి వరదకాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట నుంచి సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

గోడ పైనుంచి పడిన విద్యార్థికి గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గోడపై నుంచి పడిన మూడో తరగతి విద్యార్థి గాయపడ్డాడు. చౌడేపల్లె మండలంలో చోటు చేసుకున్న సంఘటనపై ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు చౌడేపల్లె మండలం, దుర్గసముద్రం గ్రామం, బుటకపల్లెకు చెందిన మల్లికార్జున కుమారుడు ప్రదీప్ అదే గ్రామంలో ప్రాథమి పాఠశాల్లో మూడో తరగతి చదువుతున్నాడు, పాఠశాల పక్కనే జరుగుతున్న పూజా కార్యక్రమాలను చూడడానికి స్కూల్ ప్రహరీ ఎక్కి జారీ పడ్డాడు. ప్రమాదంలో గోడకువేసిన టైల్స్ ముక్కలు కుచ్చుకుని కడుపు నుంచి పేగులు బయటకు వచ్చాయి. వెంటనే కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు చౌడేపల్లె పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలల పరిరక్షణపై ఉద్యమం అవసరం



మాట్లాడుతున్న మాజీ శాసనమండలి సభ్యులు డాక్టర్ గేయానంద్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలు పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమం అవసరమని శాసనమండలి మాజీసభ్యుడు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో విద్య, వైద్యం, ప్రజారోగ్యం కొనసాగాలని కోరుతూ జనవిజ్ఞానవేదిక, ప్రజా ఆరోగ్యవేదిక, భారత విద్యార్థి ఫెడరేషన్ సంయుక్తంగా పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్ గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మెడికల్ కళాశాల పరిరక్షణ కోసం నిర్వహించే సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ వైద్య సౌకర్యం పొందడం ప్రజల ప్రాథమిక హక్కని, దానిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. పీపీపీ విధానంలో అమలు చేయడం ప్రజా వ్యతిరేక చర్య అన్నారు. నీతిఆయోగ్ నివేదిక ప్రకారం ఆరోగ్య సూచికలో ఏపీ రాష్ట్రం 17వ స్థానంలో ఉందన్నారు. దీంతో పేద ప్రజలపై భారం పడుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, హరీంద్రనాథ్ శర్మ, కవి పోతబోలురెడ్డెప్ప, ప్రభాకర్‌రెడ్డి, రెడ్డిప్రసన్న, రాజేశ్వరి, మధురవాణి, మల్లీశ్వరి, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి : డీఎస్పీ

తంబళ్లపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో పోలీసులు ముందుండాలని డీఎస్పీ మహేంద్ర సూచించారు. సీఐ వెంకటేశుతో కలిసి తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి కేసుల నమోదు వాటి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుజాత

ప్రొద్దుటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుజాత నియమితులయ్యారు. ఆమె రెండే నెలల క్రితం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి బదిలీ పై ప్రొద్దుటూరు ఆసుపత్రికి వచ్చారు. గైనకాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. సీనియారిటీలో భాగంగా ఆమె సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. గతంలో పనిచేసిన సూపరింటెండెంట్ రూపానంద్ డాక్టర్ సుజాతకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ సుజాత మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందేలా కృషిచేస్తానన్నారు.

జీఎస్టీ 2.0తో ఔషధ ధరలు తగ్గుదల



పీలేరు ఏరియా ఆస్పత్రిలో కరపత్రాలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

పీలేరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో అత్యవసర మందుల ధరలు తగ్గాయని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం పీలేరు ఏరియా ఆస్పత్రి, పీలేరు-5 సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ సిబ్బంది నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గతంలో 12% ఉన్న సాధారణ మందులను 5% జీఎస్టీ పరిధిలోకి తెచ్చారని, 30కి పైగా క్యాన్సర్ మందులు, అరుదైన ఔషధాలపై పన్ను పూర్తిగా తొలగించారన్నారు. తగ్గిన ఔషధాల పట్టికతో కూడిన కరపత్రాలను రోగులకు పంపిణీ చేశారు. రేగళ్లు పీహెచ్‌సీ సిబ్బంది పాత బస్టాండు ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతమ్మ, సీహెచ్ఓ సరస్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ఉండాలి

తంబళ్లపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీడీఓ బాహూజీ పట్నాయక్ అన్నారు. ప్రభుత్వాస్పత్రిలో తగ్గిన మందుల జీఎస్టీ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి తేజశ్విని, వైద్యులు అమర సింహరాజు, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వర్ రెడ్డి, హెడ్ నర్సు గ్లోరి, సీహెచ్ఓ ఆది లక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖర్చులకు వెసులుబాటు

కలికిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ శ్లాబులు తగ్గించిన కారణంగా వైద్యరంగంలో మందుల ఖర్చుపై ప్రజలకు భారం తగ్గనుందని కలికిరి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యఖర్చుల్లో ఎక్కడెక్కడ జీఎస్టీ తగ్గదల వుంటుందో వివరించారు. రెండు రకాల శ్లాబుల కారణంగా ప్రజలకు జరిగే మేలు గురించి ఎంపీడీఓ భానుమూర్తిరావు విశదీకరించారు. కలికిరి పంచాయతీ కార్యదర్శి జి.అశోక్, వైద్యులు వెంకటేష్, ఉదయ కిరణ్, శశికుమార్, విజయచంద్రిక, నర్సులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపు, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి పేర్కొన్నారు. కురవంక సచివాలయంలో సిబ్బందితో సూపర్ సేవింగ్స్ పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రేట్లు తగ్గాయన్నారు. వీటిపై ప్రజలు అవగాహన కల్పించుకుని వస్తువులు కొనే సమయంలో తగ్గిన జీఎస్టీ ధరలు వున్నాయా, లేవా సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పనులు ఎప్పుడో...?





నీరున్నా ఆయకట్టులో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి - వర్షపునీటితో మొరవపోతున్న పెద్దమండ్యం పాతచెరువు

పెద్దమండ్యం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలకు గండ్లు పడిన చెరువు కట్టలు, ఆయకట్టు సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతుల మట్టి పనులకే పరిమితమయ్యాయి. ఐదేళ్లగా వర్షకాలంలో పలు చెరువు కట్టలు, సాగు కాల్వలకు గండ్లు పడడంతో ఆయా చెరువుల ఆయకట్టు దారులు పంట సాగుకు సుముఖత చూపడం లేదు. పంట తుది దశలో చెరువు నీరు పంటకు అందడం కష్టమవుతోందన్నారు. గతంలో పంట కోత సమయంలో నీరందక పంటలు ఎండిపోయిన సంఘటనలు ఉన్నాయి. మండలంలో ఈ కోవకు చెందిన చెరువుల సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆయా ప్రాంతంలో చెరువులు నిండినా రైతులు వరి సాగు చేయడం లేదు. ఇలాంటి సమయంలో చెరువులో నీరు పుష్కలంగా ఉన్నా తాత్కాలిక మరమ్మతు చేసినా కాల్వలను నమ్ముకుని పెట్టుబడులు పెట్టి సాగు చేయడం లేదు. సాగు కాల్వలు శాశ్వత అభివృద్ధి పనులు చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దీంతో ప్రస్తుతం మండలంలో పలు చెరువులు నిండిన సాగు కాల్వల దుస్థితితో వరి పంటలు పండించుకోలేక పోతున్నారు. పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంటకు వచ్చే వర్షపు నీటి కాల్వకు (పెద్దమండ్యం యల్లమ్మగుడి వద్ద) తాత్కాలిక మరమ్మతులు చేశారు. కలిచెర్ల పాపిరెడ్డిచెరువు గండి పడిన సాగు కాల్వకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. బసిరెడ్డిచెరువు మొరవ కాల్వ గండిపడడంతో తాత్కాలికంగా మట్టి వేశారు. ఈ చెరువు నీరు ఎర్రగుట్ట చెరువు, ఉప్పరపల్లి చెరువుకు పోతాయి. తాత్కాలిక మరమ్మతు, మట్టి పనులు ఆయకట్టు రైతులే చేపట్టారని రైతులు తెలిపారు. చెరువులకు వర్షపు నీరు చేరినా రైతుల్లో నిరుత్సాహం కనిపిస్తోంది. మండలంలో గండి పడిన చెరువులకు మమరమ్మతు చేస్తే ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేస్తామని చెరువు ఆయకట్టు రైతులు తెలిపారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని గండి పడిన చెరువు కట్టలు, సాగు కాల్వలు, తదితర మరమ్మతులు చేయాలని రైతులు కోరారు.

ప్రతిపాదన పంపించాం

గండి పడిన చెరువు కట్టలు సాగు కాల్వలు మరమ్మతులకు గురైన చెరువులను గుర్తించాం. చెరువుల అభివృద్ధి పనులకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాము. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

సతీష్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఈఈ

రేపు మాజీ సీఎం కలికిరి రాక

కలికిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి శనివారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. మధ్యాహ్నం 2.35 గంటలకు చేరుకుంటారని, ఆదివారం బీజేపీ కార్యాలయంలో అందుబాటులో వుంటారని చెప్పారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తాం



ఎంఈఓ మనోహర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దమండ్యం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలు బహిష్కరిస్తామని పెద్దమండ్యం ఎంఈఓ మనోహర్‌కు ఫ్యాప్టో (ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) మండల ఉపాధ్యాయ సంఘ నేతలు వినతి పత్రం అందజేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు వినతి పత్రం అందజేసినట్లు సంఘ నేతలు తెలిపారు. సురేంద్రారెడ్డి, సిద్దారెడ్డి, బాబు, జనార్ధనరెడ్డి, భాస్కరరెడ్డి, ప్రసాద్, పుష్పలత పాల్గొన్నారు.

కార్యక్రమాలను బహిష్కరిస్తాం...


నిమ్మనపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తామని యూటీఎఫ్ నేతలు ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ-1 పద్మావతికి వినతి పత్రం అందించారు. (ఫ్యాప్టో)ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 10వ తేదీ నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, మోహన్, గోప్రియానాయక్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. గురువారం బండ్లపై పంచాయతీలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పరిశీలించి కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వే సమయంలో పట్టా, ప్రభుత్వ భూములను గుర్తించి పూర్తి నివేదికను తయారు చేయాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవవేతనం ఇప్పించండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చర్చిలో పనిచేస్తున్న పాస్టర్లకు పెండింగ్‌లో వున్న గౌరవ వేతనం మంజూరు చేయించాలని గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్లరామయ్యను కోరారు. మంగళగిరి టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో వర్లరామయ్యను కలిసిన ఆయన మాట్లాడుతూ పది నెలలుగా పాస్టర్ల వేతం మంజూరు కాలేదన్నారు. రాష్ట్రంలో పలు పట్టణాల్లో క్రైస్తవులకు సమాధుల తోట నిర్వహణకు స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఎండీ శేఖర్‌ను కలిసి చర్చి నిర్మాణాలకు, జెరూసలేం యాత్రకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.



మసీదు అక్రమ నిర్మాణం ఆపాలని వినతి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వేంపల్లె క్రాస్ వద్ద చేపడుతున్న మసీదు అక్రమ నిర్మాణం ఆపాలని అంకిశెట్టిపల్లె గ్రామస్తులు తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి విన్నవించారు. అంతకముందే తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అక్కడ మసీదు నిర్మిస్తే గ్రామస్తులకు నష్టం కలుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు మండల సమావేశం

గుర్రంకొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి తెలి పారు. సమావేశానికి మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరవాలని కోరారు.

‘నిషేధిత భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు?’

మదనపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ఎస్సీల భూములు పలువురు నేతలు హస్తగతం చేసుకున్నారని కురబలకోట వైసీపీ నాయకురాళ్లు ఆరోపించారు. 22ఏ జాబితాలోని భూములను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని వారు ప్రశ్నించారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మండల అధ్యక్షురాలు భూదేవి మాట్లాడుతూ కురబలకోట మండలం ముదివేడు రెవెన్యూ సర్వేనంబర్ 389-1ఏ, 389-1బిలో హైవే పక్కనున్న పేదల డీకేటీ భూమిని పెద్దలు ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ప్రశ్నించారు. కలెక్టర్ ఎలా ఎన్‌ఓసీ ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. టీడీపీ పాలనలో అక్రమ క్వారీల దందా, నకిలీ మద్యం ఏరులై పారుతోందని, ఇంటింటికీ డోర్ డెలవరీ చేస్తున్నారని, దీనికి మహిళలు కూడా అలవాటు పడి ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆమె ఆరోపించారు. ఎస్సీల భూములు ఎస్సీలకే చెందాలని, వీటిని అమ్మకూడదు, కొనకూడదనే నిబంధన ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీ టీసీ ఆనంద్‌రెడ్డి, ఉమాపతి, వసంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీకాసుల హారం బహూకరణ

పీలేరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కోటపల్లెలోని పద్మావతి ఆండాళ్ వేంకటేశ్వర స్వామికి విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి పుష్పాల పురుషోత్తం రూ.2 లక్షలు విలువైన లక్ష్మీకాసుల హారం గురువారం బహూకరించారు. పురుషోత్తంను ఆలయ ధర్మకర్త శ్రీనాథరెడ్డి అభినందించారు. పురుషోత్తం కుటుంబ సభ్యులు హర్షవర్ధన్, సౌజన్య, హరితప్రియ, కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యవర్గానికి లైన్ క్లియర్

మదనపల్లె టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా దోబూచులాడుతున్న మదనపల్లె మార్కెట్ కమిటీ కార్యవర్గం కూర్పునకు ఎట్టకేలకు ప్రభుత్వం లైన్ క్లియర్ చేసింది. కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తూ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ జీఓ విడుదల చేసింది. మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష, చైర్మన్‌గా జంగాల శివరామ్, వైస్‌చైర్మన్‌గా రామిశెట్టి ఆంజనేయులు, సభ్యులుగా చల్లా నరసింహులు, ఆర్.సుబ్రమణ్యం రెడ్డి, బి.ప్రమీల, బి.మున్నానాయక్, బి.మణి, పి.వాణి, బి.శ్యామలమ్మ, బర్నేపల్లె సంధ్యారాణి, ఆర్.అరుణ, ఎం.రెడ్డెమ్మ, పి.నూరున్నీసా, ఇ.రెడ్డిశేఖర్, మదనపల్లె పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, మున్సిపల్ చైర్‌పర్సన్, జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏడీలను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

రేపు శని భగవానుడికి మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శనేశ్వర స్వామికి శనివారం మహాతైలాభిషేకం నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ వాల్మీకిపురం



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ మనోహర్‌రాజు

వాల్మీకిపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే స్వచ్ఛ వాల్మీకిపురం సాధ్యమవుతుందని ఎంపీడీఓ మనోహర్ రాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో పారిశుధ్య పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిత్యం జరిగే పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నివాసాల వద్ద ఏర్పాటు చేసిన చెత్త కుండీలను సద్వినియోగం చేసుకోవాలని, సేకరణ వాహనాల్లోనే చెత్తను వేయాలన్నారు. ఇష్టారాజ్యంగా చెత్తకుప్పలు వేయడం, దుర్గంధంతో నివాసులకే ఇబ్బందులు తలెత్తుతాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్, సిబ్బంది, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కలకడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టీటీడీ, సమరతసేవా ఫౌండేషన్ కలకడ గుట్టపల్లెలో రెండు రోజులు కోదండ రాముల వారి ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శనివారం ఉదయం నుంచీ హోమాలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. మొదటి రోజు రాత్రి, రెండో రోజు మధ్యాహ్నం అన్నదాన వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



‘బాస్’ ఆధ్వర్యంలో ఘనంగా కాన్షీరాం వర్ధంతి

మదనపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ శిల్పి అంబేడ్కర్ ఆకాంక్ష నెరవేర్చిన, అంబేడ్కర్ కలల పంట దాదాసాహెబ్ కాన్షీరామ్ అని బాస్ అధినేత, వీసీకేపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ అన్నారు. కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని బాస్ కార్యాలయంలో సంస్మరణ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నీరుగట్టి రమణ, బయన్న, గంగాధర్, ఎస్.రెడ్డెప్ప, క్రాంతి, రవిశంకర్, పృధ్వీరాజ్, చరణ్ పాల్గొన్నారు.

పీలేరులో కాన్షీరాంకు నివాళులు

పీలేరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరాం 19వ వర్ధంతిని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) నేతలు నిర్వహించారు. బాస్ కార్యాలయంలో కాన్షీరాం చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. బాస్ అన్నమయ్య జిల్లా కో-కన్వీనర్, డీవీఎంసీ సభ్యుడు పూలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ బహుజన రాజ్య స్థాపనకు చివరి శ్వాస వరకు కాన్షీరాం కృషి చేశాడన్నారు. బాస్ నేతలు ముల్లంగి గురవయ్య, ఎర్రబెల్లి మల్లిఖార్జున, గుండ్లూరి రవీంద్ర, ఆనంద, రమేశ్ నాయక్, సంతోశ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై విస్తృత అవగాహన కల్పించండి

తంబళ్లపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై విస్తృత అవగాహన కల్పించాలని సీడీపీఓ సుజాత అన్నారు. తంబళ్లపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు సుపోషిత్ భారత్ సక్ష్యం భారత్‌పై అవగాహన కల్పించారు. పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేసి పౌష్టికాహారంతో కలిగే ఉపయోగాలను వివరించారు.

ఆకట్టుకున్న ఖవ్వాలి పోటీలు

ములకలచెరువు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీమహల్ వద్ద వెలసిన హజ్రత్ మహబూబె సుబహానీ ఉరుసు ఉత్సవాల్లో జరిగిన ఖవ్వాలి పోటీలు ఆకట్టుకున్నాయి. ఉరుసు ఉత్సవాల్లో గురువారం రాత్రి కర్ణాటకకు చెందిన సిమ్రాన్‌తాజ్, మైసూర్‌కు చెందిన ముజమిల్ దరాజ్ మధ్య తెల్లవారుజామున వరకు పోటీ జరిగింది. ఉరుసుకు భారీగా భక్తులు, స్థానికులు తరలిరావడంతో కిక్కిరిసింది. దర్గా కమిటీ ప్రెసిడెంట్ అగ్రహారం కాలేషా, కమిటీ సభ్యులు గౌస్‌బాషా, జహీర్, ఆటో రఫి, రియాజ్, చాను, మెకానిక్ మస్తాన్ పాల్గొన్నారు.

భద్రతానియమాలు పాటించండి : సీఐ

వాల్మీకిపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి9: రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని సీఐ రాఘవరెడ్డి హెచ్చరించారు. పట్టణ వ్యాప్తంగా, జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. హెల్మెట్, సీట్‌బెల్టు ధరించకుండా నడుపుతున్న వాహన చోదకులను తీవ్రంగా మందలించారు. జాతీయ రహదారిపై కౌన్సెలింగ్ ఇస్తూ వాహన చోదకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.